4584
శ్రీకాకుళం

# భిన్న సందర్భాలు

లంచ్‌టైంలో అమ్మాయిల వెయిటింగ్ రూం కోలాహలంగా వుంది. ఆ సమయంలో హాస్టల్ అమ్మాయిలు తప్ప మిగిలిన వాళ్ళంతా వెయిటింగ్ రూంకే వస్తారు. అమ్మాయిల సంఖ్యతో పోలిస్తే వెయిటింగ్ రూం చాలా చిన్నది.

రెండు విశాలమైన టేబిళ్ళు, ఒక పాతిక కుర్చీలు, ఎనిమిది బల్లలూ వున్నాయి గానీ నాలుగొందలమంది అమ్మాయిలకవి చాలవు. వరండాలోనూ, మెట్లమీదా, మెట్లు దిగాక వున్న చిన్న ఖాళీస్థలాలలోనూ గ్రూపులు, గ్రూపులుగా చేరిన అమ్మాయిలు, ఆ గంటా గలగలా మాట్లాడుతుంటారు. ఛాయా వాళ్ళ గ్రూపు వెయిటింగ్ రూంలో పెద్ద టేబిల్‌ని ఆక్రమించారు. పదిమంది టేబిల్ మీద కూచుంటే మరో పదిమంది చుట్టూ నిలబడ్డారు. కొందరు టిఫిన్ బాక్సుల్లో తెచ్చుకున్న ఫలహారాలు తింటూనే మాట్లాడుతున్నారు. "ఏమో - ఇదంతా జరిగే పనేనా" సుభద్ర పెదవి విరిచింది. "అసలు రాధాకృష్ణ గారిని కనుక్కుందాం ఆయన నాటకం వెయ్యొచ్చు అంటే వేద్దాం. తీరా మనం నాటకం రాసుకుని, రిహార్సల్స్ చేసి అంతా అయ్యాక వొద్దంటే యిక మనకి యేడుపొక్కటే తక్కువవుతుంది" నిర్మల పెద్దతరహాగా సలహా యిచ్చింది.

"నాటకాల పోటీ వుందని ప్రకటించిన తర్వాత కూడా యింకా పర్మిషన్ తీసుకోవటం యేమిటి? మనమేమన్నా స్పెషల్‌గా వేస్తున్నామా?" శాంతి తన అయోమయం తనకే కోపం కలిగిస్తే అది అణుచుకుంటూ అన్నది.

"అమ్మా - నువ్వీ యేడాదే ఈ కాలేజీలో చేరావు. మాకిది మూడో సంవత్సరం. ప్రతి యేడూ నాటకాల పోటీలు అబ్బాయిలకు మాత్రమే జరుగుతాయి. అమ్మాయిలకు పోటీల్లో అనుమతి లేదు. ఈ సంవత్సరం అనుమతించమని అడగాలనే మనం ఈ మీటింగ్ పెట్టుకున్నాం" ఛాయ అరచి చెప్పింది.

"అదేంటి యింత అన్యాయమా? ఆడ పిల్లలంటే యింత చులకనా?" ఈ సారి కోపాన్ని అణుచుకోకపోగా యెక్కువ చేసుకుని కళ్ళెర్ర చేసింది శాంతి.

"అవును-అందుకే, ఇంకానా యికపై సాగదు, అంటూ మనందరం ఈ సంవత్సరం నాటకం వేసి తీరాలి. పోటీల్లో గెల్చి తీరాలి" ఛాయ వుద్రేకంగా అంది.

"పదండి. రాధాకృష్ణ మాస్టారు దగ్గరకు" శాంతి ఆవేశంగా అరచిన అరుపుకు అందరూ లేచి వుత్సాహంగా స్టాఫ్‌రూం వైపు నడిచారు. ఐదేళ్ళ క్రితం అమ్మాయిలు నాటకం వేస్తే అబ్బాయిలు చేసిన అల్లరీ, విరిగిన కుర్చీల సంఖ్యా, అప్పటితో కాలేజీ మానేసిన అమ్మాయిల సంఖ్య, ఆ సంవత్సరం నుంచీ నాటకాల పోటీలు అబ్బాయిలకే జరగటం యివన్నీ తన అక్కయ్య సుభద్ర ద్వారా వినివున్న లీల శాంతికి వివరంగా చెప్పింది. ఆ సంవత్సరం

సుభద్ర అదే కాలేజీలో పి.యు.సి. చదివి తప్పింది. ఇపుడు బి.ఏ. మూడో సంవత్సరం. శాంతీ, లీలా బి.ఏ. రెండో సంవత్సరం. శాంతి ఈ సంవత్సరమే ఈ కాలేజీలో చేరింది. అంతకు ముందు రేపల్లెలో చదివేది. తండ్రి ట్రాన్స్‌ఫర్‌తో అందరూ గుంటూరు వచ్చేశారు. శాంతి తన గ్రూపు, డబుల్ లిటరేచర్, ఏ.సి.కాలేజీలో వుండటంతో విమెన్స్ కాలేజిలో చేరాలనే ఆలోచన కూడా లేకుండా ఏ.సి. కాలేజిలో చేరింది. అంతమంది అమ్మాయిల్ని చూసి ఆశ్చర్యపడ్డారు స్టాఫ్‌రూం లో వున్న అధ్యాపకులు. కబురు అందుకుని తోసుకుని, గిల్లుకుని, చివరకు ఛాయనీ శాంతినీ ముందుకు నెట్టారు.

శాంతి తనతోపాటు లీలను కూడా ముందుకు లాక్కొచ్చింది. "ఫస్టియర్సు, ఫైనలియర్సు అందరూ కలిసొచ్చారు. ఏంటి విశేషం? హామ్లెట్ క్లాస్‌కి మీరు కూడా వస్తారా?" హామ్లెట్ నాటకం రాధాకృష్ణ గారు చాలా బాగా చెబుతారు. ఆయన క్లాసుకి ఆ పుస్తకం తమకు సిలబస్ వున్నాలేకపోయినా, ఆసక్తి వున్న విద్యార్థులంతా వస్తారు. సాహిత్యం అంటే యిష్టమున్న విద్యార్థులు బి.ఏ., బి.యస్సీ., బి.కాం. యేది చదువుతున్నా కనీసం ఐదారు క్లాసులకన్నా వచ్చి, రాధా కృష్ణగారి పాఠం విని తృప్తి పడతారు. ఇపుడు వీళ్ళందర్నీ చూసి ఆయన హామ్లెట్ క్లాస్‌కు వస్తామని అడగటానికే వచ్చారనుకున్నాడు. అందరూ రెండు నిమిషాలపాటు నిరుత్తరులై నిలబడ్డారు. చివరకు ఛాయ ధైర్యం పుంజుకుని అడిగింది. "నాటకాల పోటీలు యనౌన్స్ చేశారు గదా సార్-అమ్మాయి లందరం కలిసి ఓ నాటకం వెయ్యాలనుకుంటున్నాం" రాధాకృష్ణగారి ముఖంలో నవ్వు మాయమైంది. "అది కుదరదమ్మా, అనవసరంగా గొడవలవుతాయనిగదా ఆడపిల్లలకు ఈ పోటీలు వద్దనుకున్నాం. నాలుగేళ్ళనుంచీ ప్రశాంతంగా జరిగిపోతున్నాయి. మళ్ళీ ఈ గొడవలన్నీ యెందుకు? ఆ ప్రసక్తి మానేయండి"

"అదేంటిసార్"- ఛాయ యేదో మాట్లాడబోయింది. ఇంతలో శాంతి అందుకుంది.

"సర్-గోలచేసింది అబ్బాయిలు. అల్లరికి కారణం అబ్బాయిలు. మీరు పోటీలనుంచి బహిష్కరించింది మాత్రం అమ్మాయిలను. ఇదేం న్యాయం సార్"

అమ్మాయిలందరికీ ఈ లాజిక్‌తో పెద్దబలమొచ్చినట్లయి ఔను ఔనంటూ శాంతిని బలపరిచారు.

"అబ్బాయిల్ని బహిష్కరిస్తే యిక పోటీ లెవరికి పెట్టాలి? మీరు వేసేది ఒక నాటకం. వాళ్ళు పది నాటకాలు వేస్తారు. వాళ్ళను వొద్దంటే పోటీలే లేవు."

శాంతి మాటల్ని అర్థంలేని మాటలుగా కొట్టేసారు రాధాకృష్ణ. శాంతి ఒప్పుకోలేదు.

"అబ్బాయిల్ని బహిష్కరించండి. మేం యిరవై నాటకాలు తయారు చేసుకొస్తాం" ఛాలెంజ్ చేస్తున్నట్లు అంది.

శాంతి ఈ ఆవేశం అమ్మాయిలకు కూడా మింగుడు పడలేదు. ఈ మాటనెవరూ బలపర్చలేదు.

"అప్పుడు గాని సమ్మెలూ, కాల్పులూ, కర్ఫ్యూల వరకూ వెళ్ళదు వ్యవహారం" నిరసనగా అన్నారు రాధాకృష్ణ.

"అంటే వాళ్ళు దౌర్జన్యం చేస్తారు గాబట్టి వాళ్ళకు అన్ని అవకాశాలూ యిస్తారు. అన్నీ వాళ్ళకు అనుకూలంగా వుండేలా యేర్పాటు చేస్తారు. మేం బలహీనులంగాబట్టి మమ్మల్ని బహిష్కరిస్తారు. వెనక్కి నెట్టేస్తారు. అంతే గదండీ?"

శాంతి ఆవేశంగా ప్రశ్నించింది.

రాధాకృష్ణ గారికి ఈ ప్రశ్నల్ని తట్టుకోవటం కష్టమనిపించింది.

మర్నాడు లంచ్‌టైంలో ఛాయకు స్టాఫ్‌రూం నుంచి కబురొచ్చింది. ఆ గ్రూపులోని అమ్మాయిలంతా ఛాయను పంపి - మరుక్షణం నుంచీ వార్తకోసం యెదురుచూస్తూ నిలబడ్డారు. ఛాయావాళ్ళు నాటకం వేస్తామని అడిగారట అన్న వార్త తెలిసిన మిగిలిన అమ్మాయిలుకూడా ఓ చెవి యిటు పారేసి తమ కబుర్లు కొనసాగిస్తున్నారు.

ఛాయ పదినిమిషాలు కాకుండానే వచ్చేసింది. సంతోషంగా వున్న ఛాయ ముఖం చూడగానే అందరికీ అర్థమైంది. చుట్టూ మూగి వూపిరాడకుండా ప్రశ్నలు వేశారు.

"ఒప్పుకున్నారు!" అందరికీ సమాధానంగా పెద్దగా అరిచింది ఛాయ.

అమ్మాయిలంతా సంతోషంతో కేరింతలు కొట్టారు.

"ఐతే ఒక విషయం. చాలా సీరియస్ విషయం. అందరూ జాగ్రత్తగా వినండి" ఒక్కసారి అందరూ నిశ్శబ్దమై క్యూరియస్‌గా ఛాయవంక చూశారు.

"మనం నాటకం వెయ్యబోతున్నట్లు యెవరికీ - ముఖ్యంగా అబ్బాయిలకు తెలియగూడదు. అంతా రహస్యంగా జరిగిపోవాలి. ఒక ఆదివారం వుదయం మన ప్రదర్శన జడ్జీలు మాత్రమే చూస్తారు. మనం చాలా జాగ్రత్తగా ఈ రహస్యాన్ని కాపాడాలి. ఇది యెవరికన్నా తెలిసినట్టుంటే ప్రదర్శన కాన్సిల్ చేస్తానన్నారు" అమ్మాయిలు అయోమయంగా, ఆశ్చర్యంగా చూశారు. శాంతికీ, లీలకూ చాలా కోపం వచ్చింది.

"అంటే మనమీద జాలిదలిచి, మన పోరుపడలేక యిలా దారి చూపించారన్నమాట. ఒక హక్కుగా మన నాటకం వెయ్యటానికి వీల్లేదన్నమాట."

"ఎలాగోలా నాటకమైతే వేస్తాం గదా. అసలు లేనిదానికంటే యిది నయం కదూ. ఈ సంవత్సరం యిది సాధిస్తే వచ్చే సంవత్సరం హక్కుగా అడగొచ్చు. దయచేసి ఈ విషయం రహస్యంగా వుంచండి". ఛాయ అందర్నీ వొప్పించే ధోరణిలో మాట్లాడింది. "పోనీలే - అబ్బాయిల వెధవగోల లేకుండా నాటకం జరిగిపోతుంది. ఫ్రీగా చేసుకోవచ్చు. ఇదీ మన

మంచికే -" అంది సుభద్ర.

"ఆడిటోరియం ఖాళీగా వుంటే నాటకం వెయ్యబుద్ధవుతుందా? మనల్ని నీరు గార్చటానికి చేసిన కుట్ర" అంది లీల. చివరకు ఈ సంవత్సరానికిది రహస్యంగా జరిగి పోవటమే మంచిదనుకున్నారు.

ఛాయ నాటకం థీమ్ చెప్పి రెండు రోజుల్లో రాసుకొస్తానంది. మూడోరోజు వెయ్యాల్సిన పది మంది అమ్మాయిలూ ఛాయా వాళ్ళింటి డాబా మీద సమావేశమయ్యారు.

ఛాయ యెవరే పాత్ర వేస్తే బాగుంటుందో చెబుతోంది. "సుభద్రా - నువ్వు హీరోయిన్ పాత్ర వేసెయ్. నీ ముఖం నవ్వుతుంటే యెంత బాగుంటుందో, యేడుస్తున్నా అంతే బాగుంటుంది. మన నాటకంలో హీరోయిన్ దాదాపు యేడుస్తూనే వుంటుంది" అంది ఛాయ.

"అంత యేడుపుగొట్టు హీరోయిన్‌తో నాటకం రక్తికట్టినట్టే" అంది సుభద్ర.

"అదేగా తమాషా - మొదట్నించి యేడుస్తున్న హీరోయిన్ చివరికి తిరగబడి "యెర్రబడ్డ కళ్ళనీళ్ళు యాసిడ్‌లా మారతాయంటూ" విజృంభిస్తే అప్పుడొస్తుంది మజా" అంది ఛాయ.

"కానీ మా అక్కమాత్రం హీరోయిన్‌గా వెయ్యదు" లీల నవ్వుతూ అంది.

"ఏం? అయినా నీకెలా తెల్సు మీ అక్క వెయ్యదని?"

"స్క్రిప్టు చదివా గనక తెల్సు - హీరోయిన్ ఆరునెలల గర్భవతిగా వుండగా క్లయిమాక్స్ సీన్ జరుగుతుంది."

"అయితే -" శాంతి అడగబోయిన ప్రశ్న పూర్తి కాకుండానే

"గర్భవతిగానా? నేనుచస్తే వెయ్యను." తేల్చి చెప్పేసింది సుభద్ర.

"ఒక్కసీన్లోనే తల్లీ. ఏమవుతుంది? కొంచెం పొట్ట లావుగా చేస్తాం. ఇంతలోనే - నువ్వు స్టేజిమీద వుండగానే డెలివరీకాదు."

"ఆరోనెల కాదుగదా ఒకటో నెలైనా వెయ్యను. నాకూ కడుపుకీ పడదు." అంది సుభద్ర కంపరంగా.

"ఐతే మీరు పెళ్ళిచేసుకొని పిల్లల్ని కనరా?" శాంతి ఆశ్చర్యంగా అడిగింది.

"పెళ్ళి చేసుకుంటాను గానీ పిల్లల్ని కనను" సుభద్ర సులువుగానే తేల్చింది.

"అదెలా కుదుర్తుంది?"

"పెళ్ళి కావాలిగానీ పిల్లలొద్దట."

"అంతా తనిష్టమే."

నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడి నవ్వేశారు.

"మామూలుగానయితే మా అక్క పెళ్ళి చేసుకోను. పిల్లల్ని కనను అనేది. కానీ పదిరోజులక్రితం ఓ బ్యాంక్ ఆఫీసరుగారిని చూసినప్పటినుంచీ పెళ్ళి చేసుకుంటాను గానీ పిల్లల్ని కనను అంటోంది." అసలు రహస్యం చెప్పేసింది లీల.

"నువ్వు నోర్మూసుకో" సుభద్ర లీలను కసిరే లోపల అందరూ ఈ వార్తా విశేషాల కోసం అక్కచెల్లెళ్ళ మీద పడ్డారు.

ఇక నాటకం గురించి ఆశ వొదిలేసుకోవచ్చుననుకుంది ఛాయ. విశేషాలన్నీ విన్నాక రాజేశ్వరి మళ్ళీ మొదటికొచ్చింది.

"పిల్లల్ని కనటం యిష్టంలేకపోతే పెళ్ళి చేసుకోవటం యెందుకంటా?"

"పెళ్ళి పిల్లల్ని కనటానికేనా యేంటి?" సుభద్ర తరపునశాంతి అడిగింది. ఛాయ అందరికీ కాఫీలన్నీ పెట్టుకొద్దామని కిందికి దిగి వెళ్ళింది. "మరెందుకు? నిజంగానే నాకు తెలియక అడుగుతున్నాను. పిల్లల కోసం కాకపోతే పెళ్ళి యెందుకు? యెవరైనా పెళ్ళి యెందుకు చేసుకోవాలి?"

రాజేశ్వరి అధికారికంగా అడిగింది.

"కొంతమంది ఆడవాళ్ళకు పిల్లలు పుట్టరు. వాళ్ళు పెళ్ళి చేసుకుంటున్నారే. వాళ్ళు పెళ్ళిచేసుకుని హాయిగా వుండటం లేదా? వాళ్ళెందుకు చేసుకుంటున్నారో నేనూ అందుకే చేసుకుంటున్నాను."

సుభద్రకు అంతకన్న యేం చెప్పాలో తెలియలేదు.

రాజేశ్వరి ఆ మాటని ఒక్క క్షణంలో కొట్టిపారేసింది. "బాగుంది. వాళ్ళకు యేవో శారీరక కారణాల వల్ల పిల్లలు పుట్టరు. పెళ్ళవక ముందు ఆ సంగతి తెలియదు. పెళ్ళయ్యాక తెలిసినా చేసేది లేదు. అప్పుడు గూడా వాళ్ళెంత బాధపడతారో నీకు తెలుసా? పిల్లలు లేరని దిగులు, పిల్లల కోసం భర్త యింకోపెళ్ళి చేసుకుంటాడేమోనని భయం. ఎవరి పిల్లాడిని తెచ్చిపెంచుకోవాలా అనే సమస్య -

చిత్రహింస పడతారు. అంతేగాని పిల్లల్ని కనటానికి తగిన శారీరక స్థితి వున్నయే ఆడదీ నేను పిల్లల్ని కనను అని నిర్ణయించుకుని పెళ్ళిచేసుకోవటం నాకు తెలియదు. నేనెక్కడా విన్లేదు. కన్లేదు."

"ఇపుడు విన్నావూ కన్నావూ కదా" శాంతి విసుగ్గా అంది.

"నేనింకా కన్లేదు."

"పిల్లల్ని కాదు తల్లీ - సుభద్రను కన్నావు గదా"

"సుభద్రను కన్నాను కానీ పెళ్ళిచేసుకుని పిల్లల్ని కనకుండా వుండే సుభద్రని కనలేదుగా - సుభద్ర పెళ్ళి జరగనీ -" రాజేశ్వరి సమాధానానికి అందరూ గోలగోలగా నవ్వుతుంటే ఛాయ కాఫీ కప్పులతో వచ్చింది.

"సుభద్రా - నువ్వు హీరోయిన్‌గా వెయ్యకపోతే పీడాబోయింది గానీ యిపుడీ చర్చతో రిహార్సల్ పాడుచేయకండి. శాంతీ నువ్వు కూడా ఆ కారెక్టర్‌కు బాగుంటావు. నువ్వెయ్యకూడదూ?"

"ఓ.కే." శాంతి వెంటనే ఒప్పేసుకుంది.

"దీని స్పీడు చూస్తుంటే పెళ్ళికాకుండానే పిల్లల్ని కనేలా వుంది"

లీల మాటలకు అందరూ నవ్వారు. మిగిలిన పాత్రలు కూడా యెవరెవరు వెయ్యాలో నిర్ణయించుకున్నాక ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

* * * * *

సుభద్ర, లీలా యిల్లు చేరేసరికి ఏడున్నర గంటలు దాటుతోంది.

"నాన్న మనకోసం యెదురుచూడకుండా తనపని తను చూసుకుంటూవుంటే బాగుండు" అంది సుభద్ర.

"నాకు నాన్న మనకోసం యెదురు చూస్తేనే బాగుంటుంది" అంది లీల.

"నీదంతా వితండవాదం. అనవసరంగా నాన్నకి యిబ్బంది కలిగించామని గిల్టీగా అనిపించదూ?"

"నాకేం అనిపించదు. నాన్నకు మనమీద యెంత ప్రేమా అనుకుని ఆనందిస్తాను.'

ఇద్దరూ నవ్వుకుంటూ యింట్లోకి వచ్చేసరికి జగన్నాధరావు వంట ముగించి హాల్లోకి వచ్చాడు.

"సారీ నాన్నా లేటయింది" అని కారణాలు చెప్పబోతుంటే ఆయన వినిపించు కోకుండా "త్వరగా స్నానాలు చెయ్యండి. నాకు ఆకలేస్తోంది." అన్నాడు. ఇద్దరూ హడావిడిగా తమ గదిలోకి దూరారు. సుభద్రకూ లీలకూ మూడు సంవత్సరాల తేడా వుంది. లీలకు మూడోయేడు వస్తుందనగా తల్లికి మళ్ళీ కాన్పొచ్చింది. అప్పటికి సుభద్రకు ఆరోసంవత్సరం నిండుతోంది.

తల్లి పెద్దపొట్టతో ఆయాసపడుతూ తిరగటం సుభద్రకు బాగా గుర్తు. అమ్మకు జబ్బు చేసిందనీ, అమ్మ పొట్టలో పిల్లాడే దానికి కారణమనీ సుభద్ర అనుకునేది.

మహలక్ష్మికి మూడోకాన్పు కష్టమవుతుందని యెవరూ అనుకోలేదు. నొప్పులొచ్చిన

తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్దాం లెమ్మనుకున్నారు.

ముందు జరిగిన కాన్పులకు అంతే చేశారు.

కానీ ఆమెకీ సారి నొప్పులతోపాటే ధనుర్వాతం కమ్మింది. సమయానికి యింట్లో యెవరూ లేరు.

సుభద్ర ఒక్కతే తల్లి బాధ కళ్ళారా చూసింది. బాధతో, భయంతో ఆ పసిపిల్ల హడలి పోయింది.

తల్లిప్రసవవేదన, తల్లి మరణాన్ని కళ్ళారా చూడటం యివన్నీ సుభద్ర చిన్ని మనసులో హత్తుకుపోయాయి.

భార్య చనిపోయాక జగన్నాథరావు మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. పిల్లలిద్దర్నీ అయన తల్లిలాగానే సాకాడు. ఆయనకు వంట చేయటం వచ్చు. అది నామోషీ పని అనుకోడు. అందువల్ల పనికి ఒక అమ్మాయిని కుదుర్చుకుని పిల్లల్ని తల్లి గురించి బెంగపడే అవసరం లేకుండానే పెంచాడు. ఆడపిల్లలు గాబట్టి వూహ తెలుస్తున్న కొద్దీ తండ్రికి ఆసరాగా నిలబడ్డారు. ఇప్పుడు పిల్లలు పొద్దునపూట వంట చేస్తే సాయంత్రం జగన్నాథరావే బియ్యం కడిగి కుక్కర్‌లో పడేస్తాడు.

ఐతే ఆయన మీద కంటే సుభద్ర మీద తల్లి మరణం మరొకరకంగా కూడా చెరగని ముద్ర వేసింది.

కడుపుతోవున్న ఆడవాళ్ళను చూస్తే సుభద్రకు విపరీతమైన బాధా, భయం కలిగేవి. వాళ్ళు సుఖంగా ప్రసవమయ్యారని తెలిసినా కూడా ఆమె బాధతగ్గేదికాదు. అసలు వాళ్ళు అంత ప్రమాదంలోకి, మృత్యువుకి అంత సమీపంలోకి వెళ్ళగూడదని అనిపించేది. ఎత్తుగా పొట్టలతో కన్పించే ఆడవాళ్ళను చూడటం కూడా సుభద్రకు యిష్టం వుండదు. వయసు వచ్చే కొద్దీ, తాను కూడా గర్భవతి అయ్యే అవకాశం వుందని తెలిసి విపరీతంగా భయపడేది.

గర్భం యెలా వస్తుందో కొంత తెలిశాక, కొన్నాళ్ళు నిశ్చింతగా వుంది. పెళ్ళి చేసుకుంటేనే గర్భం వొస్తుంది. తను పెళ్ళి చేసుకోదు. సమస్య పరిష్కారమైనట్లు భావించుకుని రెండుమూడేళ్ళు చింతపడకుండా గడిపింది.

కానీ క్రమంగా ఆమెకు వయసుకు తగ్గ వూహలొచ్చాయి.

పెళ్ళి చేసుకోకుండా వుండటం అంత తేలికకాదని తెలిసి వచ్చింది. దానితోపాటు గర్భధారణ గురించి ఆమె జ్ఞానం కూడా పెరిగింది. పెళ్ళి చేసుకునికూడా పిల్లల్ని కనకుండా వుండే వీలుందని తెలిసింది. పది రోజుల క్రితం ఆమెను చూడటానికి వాసు వచ్చినప్పుడు సుభద్ర చెప్పనలవిగాని సంఘర్షణను అనుభవించింది.

వాసు ఆమెకు బాగా నచ్చాడు.

కానీ పెళ్ళి చేసుకుని పిల్లల్ని కననంటే పూరుకుంటాడా?

అతనికి పిల్లలు కావాలంటే -

ఈ విషయం తండ్రితో చెప్పుకోవాలనిపించలేదు. జగన్నాథరావు వాసు నచ్చాడా అని అడిగినప్పుడు నచ్చాడనే చెప్పింది. అన్ని విధాలా అనుకూలమైన సంబంధమని ఆయన తృప్తి పడ్డాడు. ఇవాళ జరిగిన చర్చతో సుభద్ర మనసు మళ్ళీ అల్ల కల్లోలమైంది. అన్యమనస్కంగానే భోజనం ముగించి పుస్తకం పట్టుకుంది గానీ ఆమె మనసునిండా ప్రశ్నలు చీమల్లా వచ్చి చేరి పుట్టలు పెడుతున్నాయి.

* * * * *

శనివారం మధ్యాహ్నం లంచ్‌టైంలో కాలేజిఅంతా కదిలిగేటు ముందుకు వచ్చింది. గేటు దగ్గర నిలబెట్టివున్న బ్లాక్‌బోర్డుని చూడటానికి ఒకర్నొకరు తోసుకుంటూ మగపిల్లలందరూ గుంపులుగా నిలబడ్డారు. ఆ బ్లాక్‌బోర్డుమీద మర్నాడు వుదయం అమ్మాయిలు వేయబోయే నాటకం వివరాలన్నీ పెద్దపెద్ద అక్షరాలతో రాసి పెట్టివున్నాయి. కాలేజి అంతా కార్చిచ్చు కన్నా వేగంగా వ్యాపించిందావార్త. దడదడలాడే గుండెలతో హిస్టరీ క్లాసులో వెనకబెంచీలో కూచున్న ఛాయమిత్రబృందానికి స్టాఫ్‌రూంలో వుండే అటెండరు క్లాస్‌రూంలోకి రాగానే స్పృహ తప్పినంత పనయింది.

అటెండరుయిచ్చినకాగితం తీసుకుని హిస్టరీ మాస్టరు "ఛాయ", "సుభద్ర" అని పేర్లు చదివి రాధాకృష్ణగారు వెంటనే రమ్మన్నారు అని చెప్పారు.

ఇద్దరూ కాళ్ళని బలవంతాన కదిలించి అడుగులో అడుగువేస్తూ బయల్దేరారు. ఎంత మెల్లగా నడిచినా స్టాఫ్‌రూం రానే వచ్చింది. అక్కడ అప్పటికే లీలా, శాంతీ నిలబడి వున్నారు. వీళ్ళిద్దరికంటే వాళ్ళిద్దరే ధైర్యంగా వున్నారు. ఈ బ్లాక్‌బోర్డు ఆలోచనా ఆచరణా కూడా వాళ్ళదే.

రాధాకృష్ణగారు వచ్చి "ఎవరా పని చేసింది?" అనడిగారు సీరియస్‌గా, "మేమిద్దరమే మాస్టారు, వాళ్ళకేం తెలియదు" అంది శాంతి. "నేను మీతో యేం చెప్పాను? నాటకం విషయం యెవరికీ తెలియగూడదు. గుట్టు చప్పుడు కాకుండా వేసెయ్యాలి అని చెప్పలేదూ?' గద్దించినట్లే అడిగారాయన. "కానీ గుట్టుచప్పుడు కాకుండా వేస్తే నాటకం వేసిన థ్రిల్ మాకు యెట్లా వస్తుంది మాస్టారు?" శాంతి ధైర్యం చేసింది.

సెకండియర్ స్టూడెంట్ తనతో సమానంగా మాట్లాడి తనను యిరుకునపెట్టే ప్రశ్నవేసేసరికి మాస్టారి బీ.పి. పెరిగిపోయింది. "థ్రిల్! థ్రిల్ కావాలా మీకు? నిజంగానే రేపు చాలా థ్రిల్లింగ్ వుంటుంది. అందరూ చేరి చేసే అల్లరికి మంచి థ్రిల్ వస్తుంది.

నేనిప్పుడే చెబుతున్నాను? రేపేం జరిగినా పూర్తి బాధ్యత మీదే-మాకెవరికీ సంబంధం లేదు. ఇది మీ స్వయంకృతాపరాధం''. అయన అక్కడ నిలబడలేక కోపంతో లోపలకు వెళ్ళిపోయారు. నలుగురూ బిక్కముఖాలేసుకుని క్లాసులకు వెళ్ళారు.

ఆ రోజు రాత్రి నాటక బృందమంతా ఛాయా వాళ్ళింటో చేరి నాలుగైదు రిహార్సల్స్ చేశారు.

ఎలాగైనా ఈ నాటకాన్ని రక్తి కట్టించి కాలేజీలో అమ్మాయిల పేరు నిలబెట్టాలని శాంతి అందరిచేతా ప్రతిజ్ఞ చేయించింది. ఛాయ అందరిచేతా సహజమన్పించేలా నటింప జేయటానికి చాలా శ్రమపడింది.

"మన ఆనంద్ వాళ్ళ నాటకానికి హైదరాబాదు నుంచీ ఒక దర్శకుడు వచ్చి ట్రైనింగు యిస్తున్నాడట. మనం వాళ్ళతో పోటీ చెయ్యగలమా?" రాజేశ్వరి తన సందేహాలతో అందర్నీ కుంగతీయాలని చూస్తుంది.

"ఎంత ట్రైనింగ్ యిచ్చినా వాళ్ళు వేసేది పిచ్చి నాటకాలు. డబ్బు లేని అబ్బాయి డబ్బున్న అమ్మాయి తనని ప్రేమించి పెళ్ళాడటానికి ఒస్తుందంటూ తను కలల్లో బ్రతుకుతూ, తను ధనవంతుడినని అందర్నీ నమ్మించి చివరకు నిరాశపడటం. అదే కథ గదా - మా నాన్నా వాళ్ళు కూడా ఈ నాటకం వేశారట.. వాళ్ళు చదువుకునే రోజుల్లో - మన నాటకం యివాళ రగులుతున్న వరకట్న సమస్య గురించి, మనందరికీ ఆ సమస్య గురించి బాధవుంది. మనకదేమిటో తెలుసు. దానిలో లీనమై పోగలం. కాబట్టి దిగులు పడాల్సిన పని లేదు" అంది ఛాయ పట్టుదలగా.

ఆదివారం వుదయం పదిగంటలకంతా కాలేజీ ఆడిటోరియం సందడి సందడిగా వుంది. అందరిలో యేదో జరగబోతోందన్న ఉద్రిక్తత చోటు చేసుకుంది.

తెర వెనక నటులంతా మేకప్ చేసుకుని సిద్ధంగా వున్నారు. నాటకం ప్రారంభమవు తుందనగా శాంతి తెర వెనక నుంచి మైక్‌లో చెప్పింది.

"సహ విద్యార్థులకు మేం ముందుగా ఒక మాట చెప్పాలనుకుంటున్నాం. నాలుగేళ్ళగా విద్యార్థినులకు ఈ కాలేజీలో నాటకం వేసే అవకాశం లేకుండా పోయింది. మేం వుత్సాహాన్ని ఆపుకోలేక ఈ సంవత్సరం నాటకం వేస్తామని అడిగాం. ఎవరికీ తెలియకుండా రహస్యంగా వెయ్యమన్నారు. కానీ అది మా కిష్టం లేకపోయింది. దానికి కారణాలు రెండు. ఒకటి - రోజూ మాతో కలిసి చదువుకునే మీరు మమ్మల్ని అవమానించరనే నమ్మకం. రెండు - మాకు ఒక వేళ బహుమతి వస్తే అది న్యాయంగా వచ్చిందేనని మీరంతా అంగీకరించేలా చెయ్యటం.

ఈ రెండు కారణాల వల్లా మేం మీ అందరి ముందూ నాటకం వెయ్యటానికి

సిద్ధమయ్యాం.

మీ మీద మాకున్న గౌరవాన్ని పోగొట్టు కోకుండా వుండటం మీ బాధ్యత."

ఈ మాటలతో ఆడిటోరియంలో గోల అణిగి గుసగుసలు మొదలయ్యాయి.

తెర తియ్యటంతో గుసగుసలు కూడా ఆగిపోయాయి. గంటసేపు ఆడిటోరియం - చిన్న చిన్న మాటలు - నటుల గురించి కామెంట్స్ తప్ప నిశ్శబ్దంగా వుంది. నాటకం పూర్తవగానే చప్పట్లతో మారుమోగింది. తెరవెనక ఛాయ, సుభద్ర, లీల, శాంతీ, రాజేశ్వరీ అందరూ ఒకర్నొకరు కావలించుకుని యేడ్చేశారు.

రాధాకృష్ణ గారు వాళ్ళ ఆనందావేశాన్ని వాళ్ళతో పాటు సమానంగా పంచుకున్నారు. బహుమతి ఈ టీమ్‌కే వచ్చి తీరుతుందని నమ్మకంగా చెప్పారు. పదిమంది అమ్మాయిలూ శంకర్ విలాస్ కెళ్ళి పార్టీ చేసుకుందా మనుకున్నారు. అక్కడ వాళ్ళ ఉత్సాహాన్ని ఆపేవారు లేరు.

"నాకు ఆ పొట్ట పెట్టుకుని ప్రెగ్నెంట్‌లా నటిస్తుంటే నిజంగా పిల్లని కనెయ్యాలని పించిందే" అంది శాంతి.

"ఛీ - అన్నీ పాడు మాటలు" అని తీసేసింది లీల.

"కాదు లీలా - నిజంగా నాకలాగ అన్పించింది. పొట్టలో చిన్న పాప కదుల్తూ వుండటం, ఆ పాప బైటికి రావటం, మనం పాలిచ్చి పెంచటం యెంత థ్రిల్లింగా వుంటుంది."

"నీకన్నీ థ్రిల్లింగ్‌లే - తొందరగా పెళ్ళి చేసుకో - వెంటనే పిల్లల్ని కనెయ్" రాజేశ్వరి వుచిత సలహా పారేసింది.

"ఛీ - నాకు పెళ్ళంటే యిష్టం లేదు. ఆ మొగుడికి చాకిరీ చేసి, అతని చెప్పుచేతల్లో వుండటం మన ఒంటికి సరిపడదు" అంటున్న శాంతిని చూస్తూ లీల తలపట్టుకుంది.

"నాకు మతి పోగొట్టటానికే సుభద్ర నాకు అక్కయ్యగా పుట్టింది. నువ్వు నాఫ్రెండ్ వయ్యావు. దానికి పెళ్ళి కావాలిగానీ పిల్లలొద్దు. నీకు పిల్లలు కావాలి గానీ పెళ్ళి వొద్దు. మీరు యేమవుతారోనని నాకు చెడ్డభయంగా వుందే - మీకు పుణ్యం వుంటుంది నన్ను టెన్షన్‌లో పెట్టకుండా అందరిలా మామూలుగా వుండండి" చేతులెత్తి యిద్దరికీ దణ్ణం పెట్టింది.

"యేమవుతాం? నీకెందుకు టెన్షన్? నేను పెళ్ళి చేసుకోకుండా పిల్లల్ని కంటాను. మీ అక్క పెళ్ళి చేసుకుని కూడా పిల్లల్ని కనదు - అంతే గదా -"

శాంతి మాటలకు నిస్సహాయంగా లీల చూసిన చూపు చూసి అందరూ విరగబడి నవ్వారు.

సుభద్ర పెళ్ళి గురించి అందరికీ ఆసక్తి పెరిగింది. వివరాలు చెప్పమని అందరూ

సుభద్రమీద పడ్డారు. సుభద్ర సిగ్గుపడుతూనే అన్ని వివరాలు చెప్పింది.

వివరాలు చెబుతున్న కొద్దీ ఆమెకు వాసు మీద ప్రేమ పెరిగింది. ఆమె యిష్టంగా చెబుతున్న తీరు చూస్తుంటే లీలకు యెందుకో భయంగా అనిపించింది.

* * * * *

"శాంతీ - నువ్వివాళ సాయంత్రం మా యింటికి రావాలి" ఛాయ శాంతికోసం వెతుక్కుంటూ వచ్చింది.

"ఎందుకు? పార్టీ యిస్తావా?"

"పార్టీ నీ ఒక్కదానికే యెందుకిస్తాను? నిన్నొకళ్ళు చూడాలనుకుంటున్నారు. అభిమాని అనుకో -"

"నాకు అభిమానా ? ఎందుకు ?"

"నాటకంలో నీ నటనకు నాటకం ముందు నువ్వు చెప్పినమాటలకు. అతను యూనివర్సిటీలో ఎకనామిక్సు ప్రీవియస్ చేస్తున్నాడు. మా అన్నయ్య ఫ్రెండు. నిన్ను కలిసి మాట్లాడాలని నన్ను చంపుతున్నాడు" చివరివాక్యం టీజింగ్‌గా అంది శాంతి.

"టూమచ్" అంది శాంతి.

"ఏదైమైనా నువ్వుమాత్రం మా యింటికి వస్తున్నావు - నాకు క్లాస్‌కి టైమవుతోంది' ఛాయ హడావుడిగా వెళ్ళిపోయింది. మళ్ళీ సాయంత్రం వరకూ శాంతికి ఆ సంగతే గుర్తు రాలేదు. ఛాయ "పోదాం పద" అంటూ వస్తే లీలను ఒదలి ఛాయతో బయల్దేరింది గానీ ఛాయతో తను కలుసుకోబోయే వ్యక్తి గురించి గాకుండా కరుణశ్రీగారు రస సిద్ధాంతం గురించి క్లాసులో చెప్పిన విషయాలను వుత్సాహంగా చెప్పటంలో మునిగిపోయింది.

ఛాయా వాళ్ళిల్లు చేరి కాఫీ తాగి ఒక అరగంట కబుర్లు చెప్పాక హఠాత్తుగా అడిగింది శాంతి. "నేనెందుకు వచ్చాను మీ యింటికి?" అని

"నేనూ వాళ్ళకోసమే యెదురు చూస్తున్నా శాంతీ - మనం కాలెజీ నుంచి వచ్చేసరికి వస్తామన్నారు -"

"సారీ ఛాయా - నేను యెవరికోసం యెదురు చూడలేను. యెదురు చూడటం నేను బొత్తిగా భరించలేని విషయం. నేను వెళ్తాను."

అంటూ బయల్దేరింది శాంతి.

ఛాయ కూడా యేమీ చెప్పలేక శాంతిని వీధి మలుపుదాకా పంపించి అన్నను తిట్టుకుంటూ తిరిగి వచ్చింది. ఆ తర్వాత నాలుగు రోజులకు శాంతీ వాళ్ళ యిల్లు వెదుక్కుంటూ వచ్చాడు కిషోర్.

సాయంత్రం ఆరవుతుండగా శాంతి డాబా మీదకు పాకిన సన్నజాజి తీగనుండి పూలు కోస్తుంటే అడ్రస్ కాగితం తీసి చూస్తున్న కిషోర్ కనిపించాడు.

ఆ సమయంలో యింట్లో శాంతీ, జానకమ్మ తప్ప యెవరూ వుండరు.

జానకమ్మ సాయంత్రపు వంటలో హడావుడిగా వుంటుంది. శాంతి తన ప్రశాంతమైన సాయంత్రాన్ని భగ్నం చెయ్యటానికి వచ్చిన ఆ వ్యక్తిని తిట్టుకుంటూ కిందకి దిగి వచ్చింది. ఛాయా వాళ్ళింట్లో తను కలవాల్సిన వ్యక్తని తెలిసి కొంచెం కంగారుపడింది.

"ఆ రోజు మీరు వెళ్ళిన పది నిముషాలకు నేను వచ్చాను". అన్నాడు కిషోర్.

"నేను వచ్చి అరగంటపైన వెయిట్ చేశాను" అంది శాంతి.

"సారీ తప్పు నాదే"

"తప్పని కాదు - ఎదురు చూస్తూ కూచోటం నాకు బోర్" నవ్వింది శాంతి.

తర్వాత కిషోర్ శాంతి ధైర్యాన్నీ, నటననీ మెచ్చుకున్నాడు. తర్వాత శాంతిని ఒక మీటింగ్‌కి పిలవటానికి వచ్చానని చెప్పి ఆ మీటింగ్ వివరాలు చెప్పాడు. విప్లవ రచయితల్ని అరెస్టు చేశారు. తర్వాత వదిలేశారు. కానీ అలా అరెస్టు చేయటం వాళ్ళ హక్కుల్ని కాలరాయటమే గదా - ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళటానికి కొందరు విద్యార్థులు ఒక మీటింగ్ పెడుతున్నారు.

దానికి రమ్మని పిలవటానికి వచ్చానని చెబుతున్న కిషోర్‌ని ఆశ్చర్యంగా చూసింది శాంతి.

"నాకు పెద్దగా రాజకీయాలు తెలియవు. నేను ఆ మీటింగ్‌కి రావాలనీ, వస్తాననీ యెందుకనుకుంటున్నారు?"

"మీలా ధైర్యం, తమ న్యాయమైన హక్కుల కోసం అడిగే స్వభావం వున్న వాళ్ళు తప్పకుండా రావాల్సిన మీటింగ్ కాబట్టి" అన్నాడు.

వస్తానని శాంతి దగ్గరమాట తీసుకుని వెళ్ళాడు కిషోర్. కానీ శాంతి ఆ మీటింగ్‌కు వెళ్ళలేదు.

ఎందుకో ఆమెకు వెళ్ళాలనిపించలేదు. ఆ తర్వాత ఒక రోజు కిషోర్ బుక్‌షాపులో కన్పించి పలకరించి శ్రీశ్రీ "మహా ప్రస్థానం" కొనిచ్చాడు.

ఆ రోజు రాత్రి ఆ పుస్తకం చదివి ఆ పుస్తకం తన చేత చదివించినందుకు కిషోర్‌ని అభినందిస్తూ వుత్తరం రాసి, ఛాయ నడిగి కిషోర్ అడ్రస్ తీసుకుని పోస్ట్ చేసింది.

కిషోర్ నుంచి ఉత్తరం వస్తుందని యెదురు చూసింది. ఉత్తరం రాకుండానే పరీక్షల హడావుడి మొదలయింది.

* * * * *

సుభద్రా, ఛాయ యిద్దరూ ఆందోళనగానే వున్నారు. సుభద్ర అరచేతుల్లో చెమట తుడుచుకుంటూ ఛాయ వంక చూసింది.

" ఆ డాక్టర్ నవ్వకుండా, తిట్టకుండా మంచిగా చెబుతుందంటావా?" సుభద్ర అడిగింది.

"నవ్వటం యెందుకు? తిట్టడం యెందుకు?" ఛాయ నవ్వింది.

"నవ్వటం మన అజ్ఞానాన్ని చూసి. తిట్టడం మనం పెళ్ళి కాకుండానే యేదన్నా వ్యవహారం నడపబోతున్నామనే అనుమానం వస్తే -"

"అన్నీ వివరంగా చెబుతాం గదా. అసలు ఫామిలీ ప్లానింగ్ పద్ధతులన్నీ వివరించటం డాక్టర్ల బాధ్యత. మనంతట మనమే వొచ్చి అడుగుతున్నందుకు ఆవిడ మనకు పూల మాల వేసి సత్కరించి కావాల్సిన సమాచారం అంతా యివ్వాలి" అని నవ్వి సుభద్ర భుజం మీద చెయ్యివేసింది ధైర్యం చెబుతున్నట్లుగా. "ఏమోనే - నాకు భయంగా వుంది". "భయం లేదు. యేం లేదు. పద పద"

ఇద్దరూ నర్సింగ్‌హోంలో ప్రవేశించారు. పిల్లలు పుట్టకుండా వుండే పద్ధతుల గురించి పెళ్ళికి ముందే తెలుసుకోవాలని సుభద్ర చాలా పట్టుదలతో వుంది. లేనిపోని ప్రమాదాల్లో యిరుక్కోకుండా ముందే జాగ్రత్త పడటం మంచిదనుకుంది.

ఫామిలీ ప్లానింగ్ విభాగం దగ్గరకు వెళ్తే అక్కడ డాక్టరమ్మ లేదు. సెలవులోవుందన్నారు -మంచి గైనకాలజిస్టు దగ్గరకు వెళ్ళి సలహా అడగొచ్చు నంది ఛాయ.

ఎక్కడ లేని ధైర్యమూ కూడదీసుకుని, యేం ప్రశ్నలడగాలో, యెలా అడగాలో వందసార్లు రిహార్సల్ వేసుకుని బయల్దేరారు.

"అసలివన్నీ మనకు తెలిసే అవకాశం వుండాలి".

"ఎలా వుంటుంది?"

"ఉండే వుంటాయి. మనకు తెలియదు. మొన్నొక పుస్తకం చూశా. అందులో ఈ విషయం వుంటుందనిపించింది గానీ, షాపులో ఆ పుస్తకం తిరగెయ్యాలన్నా, కొనాలన్నా, చచ్చే మొహమాటంగా అనిపించింది" సుభద్రకు ఆ విషయం చెప్పాలంటే కూడా యిబ్బందిగా వున్నట్టుంది.

"మొహమాటం దేనికి? ఎలాగోలా కొనేస్తే పోయేది".

"యేంటో యివన్నీ నిషిద్ధ విషయాలలాగా వుంటాయి. ఇంతా జేసి కొంటే అందులో రాసింది కరెక్టోకాదో- పుస్తకాలలో రాసినవన్నీ నమ్మలేంకదా - ఫలానా పుస్తకం మంచిది అని తెలిస్తే ఒక రకం" గొణిగింది సుభద్ర.

"పెళ్ళికాని ఆడపిల్లలకివన్నీ అనవసరం. తెలుసుకున్న వాళ్ళు మంచివాళ్ళు కాదు. పెళ్ళయ్యాక వాటంతటవే తెలుస్తాయి కాబట్టి ఈ విషయాలు ఆడవాళ్ళకి అక్కర్లేదను కుంటారు". ఛాయ అసహనంగా అంది.

నర్సింగ్‌హోం చాలా పెద్దది. డాక్టరు గారికి వూపిరాడనంత ప్రాక్టీసు. వీళ్ళకు అప్పాయింట్‌మెంట్ దొరికే సరికే గంటన్నర పట్టింది. అప్పటికి వీళ్ళిద్దరి టెన్షన్ మరింత పెరిగింది.

చివరికి ఎలాగైతేనేం యిద్దరూ లోపలికి వెళ్ళారు.

"బాధేంటి?" యేదో చూస్తున్న డాక్టరు తల కూడా యెత్తకుండా అడిగింది.

వీళ్ళు కుర్చీల్లో అనీజీగా కదిలారు.

సమాదానం రాకపోవటంతో డాక్టరు విసుగ్గా తలెత్తి

"బాధేంటంటే చెప్పరేం" అంది.

"బాధేంలేదండి. నాకు మరో పదిరోజుల్లో పెళ్ళవబోతోంది. ఫామిలీ ప్లానింగ్ గురించి తెలుసుకుందామని -" సుభద్ర కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

డాక్లరు ఎందుకోగాని దీర్ఘంగా నిట్టూర్చింది.

"లూప్ వేయించుకోండి."

"అదే మంచిదంటారా?"

"ఊ-పిల్స్ వాడితే లేనిపోని కాంప్లికేషన్స్ ఒచ్చే అవకాశాలున్నాయి. లూపే వేయించు కోండి. ఒక గంటాగితే నేనే వేస్తాను. వంద రూపాయిలు ఛార్జ్ చేస్తాను. మీరు యింకెవరి దగ్గరకైనా వెళ్తే చీప్‌గా చేయించుకోవచ్చు. కానీ యేదన్నా కాంప్లికేషన్సు, ఇన్‌ఫెక్షనూ రావొచ్చు. నేను చాలా హైజినిక్ కండిషన్లో గాని పని చెయ్యను గాబట్టి కాంప్లికేషన్సు రావని గ్యారంటీ యిస్తాను."డాక్టరు గబగబా చెప్పుకుపోతోంది.

"లూపు అంటే - ఏం చేస్తారండి"

"ఏం చేస్తాను? లోపల పెట్టేస్తాను. నొప్పేం వుండదు. ఎప్పుడన్నా నొప్పనిపిస్తే చీము పట్టిందేమో చూసి తీసెయ్యెచ్చు"

"సరే నండి - " అంటూ లేచి ఫీజు చెల్లించి బైటికి వచ్చారు. సుభద్రకు కళ్ళనీళ్ళ పర్యంతరంగా వుంది.

"లోపల పెడతారంట. ఎలాగే ! నాకు సిగ్గు - భయం."

"ఒద్దులేవే - ఆ పిల్సే వాడు" ఛాయకు కూడా లూప్ అంటే భయమనిపించింది.

"ఏవో కాంప్లికేషన్స్ వొస్తాయంటోందిగా" "కానీ నాకు యిది కూడా మంచిది కాదని

పిస్తోందే - చాలా సమస్య లొస్తాయని భయంగా ఉంది. అతనికి తెలిస్తే వూరుకుంటాడా? తెలియకుండా వుంటుందా?"

ఛాయ తనకున్న పరిజ్ఞానంతో బుర్ర బద్దలు చేసుకుంటోంది. స్నేహితురాలికి సలహా యివ్వడానికి.

"రెండూ ఒద్దనుకుంటే యిక పెళ్ళి చేసుకోకుండా వుండటం బెటరు. నేను పిల్లల్ని కనను. కనను, కనను". వుక్రోషంగా అంది సుభద్ర.

"పిల్స్ మూలాన యేం కాంప్లికేషన్స్ వొస్తాయో తెలుసుకుంటే మరీ డేంజరస్ కాకపోతే అవే వాడొచ్చు".

"ఇంకో డాక్టర్ దగ్గర కనుక్కుందాం" సుభద్రకు మళ్ళీ ఈ డాక్టర్ దగ్గరకు వెళ్ళటానికి ధైర్యం లేదు.

"ఆ గదిలోకి వెళ్ళాలంటేనే భయంగా వుంది" అంది ఛాయ కూడా.

"ఔను. ఆ పక్క గదిలోనే ఒకామె యింతెత్తు పొట్టతో కనటానికి సిద్ధంగా ఉంది చూశావా? అవిడెక్కడ కేకలు పెడుతుందోనని హడలిపోయాననుకో".

"నీది మరీ విచిత్రంలే సుభా - అందరూ కనటంలా. ఎలాగోలా ఓ పిల్లవాడిని కనేస్తే సరి".

"చచ్చినా కనను. నా కిష్టం లేదు భయం. చచ్చిపోవటమే పిల్లల్ని కనటమంటే".

మరో డాక్టరు దగ్గరకు వెళ్దామని నిర్ణయించుకుని ఎవరింటికి వాళ్ళు చేరారు.

ఏడాక్టరు దగ్గరకూ వెళ్ళకుండానే పెళ్ళి రోజు వచ్చేసింది. పెళ్ళయిపోయింది. వాసు చాలా మంచివాడని అందరూ అనుకున్నారు. లీల క్కూడా అక్క గురించి బెంగ తగ్గిపోయింది. ఈ బావ అక్క కోరికను కాదనడు. పిల్లల్ని కనను అంటే 'సరే అలాగే నీ యిష్టం' అని అక్కను ముద్దు పెట్టుకోగల సహనశీలి అనుకుంది.

వాసు సరిగ్గా అలాగే అన్నాడు. సుభద్ర మొదటిసారి పిల్లల గురించి ప్రస్తావించినపుడు.

"ఇప్పుడే పిల్లలెందుకు. కొన్నాళ్ళు ఫ్రీగా లైఫ్‌ని ఎంజాయ్ చేద్దాం" అన్నాడు. సుభద్రను గట్టిగా కౌగలించుకుంటూ. అంత బిగికౌగిలిలోనూ "యిప్పుడే" - "కొన్నాళ్ళు" అన్న మాటలు ఆమె మెదడుకు చురుక్కుమని తాకాయి. కానీ వాటి గురించి యిప్పుడాలోచించనవసరం లేదు. ప్రస్తుతానికైతే ప్రమాదం తప్పింది గదా అని మరింతగా వాసు కౌగిలిలో దూరిపోయింది.

హైదరాబాదులో వాసుతో జీవితం సుభద్ర కలలు కన్న దానికంటే యెంతో బాగుంది. ఫేమిలీ ప్లానింగ్ బాధ్యత కూడా తనే తీసుకున్నాడు. కండోమ్ వాడుతున్నాడు.

సుభద్రకు యే లోటూ లేదు.

భర్తకు కావలసినవన్నీ అమర్చి పెట్టటం. ఇల్లు దిద్దుకోవటం, ఈ రెండు పనులతో నాలుగు నెలలు గడిచేసరికి సుభద్రకు పిచ్చెక్కినట్లయింది.

యూనివర్సిటీలో అపుడే అడ్మిషన్లు మొదలవుతున్నాయి. వాసుని తను యూనివర్సిటీలో హిస్టరీ ఎమ్మే చేస్తానంది. వాసూ మొదట 'ఇంకా యేం చదువుతావులే' అని తీసెయ్యబోయాడు గానీ సుభద్ర గట్టిగా పట్టుబట్టే సరికి ఒప్పుకున్నాడు.

సుభద్ర ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీనీ, యూనివర్సిటీ ముందున్న తోటలనూ వర్ణిస్తూ రాసిన ఉత్తరం చూసి లీలా, శాంతి ఎట్లాగైనా ఆ యూనివర్సిటీలో చదివితే బాగుండుననుకున్నారు అది కుదిరే విషయం కాదని తెలిసి కూడా -

సుభద్రకు వాసూతో, చదువుతో జీవితం ఆనందంగా ఆసక్తికరంగా, యేలోటూ లేకుండా గడిచిపోతోంది.

సుభద్ర పెళ్ళి అయిన కొద్ది రోజులకే శాంతీ వాళ్ళన్నయ్య ప్రసాదు పెళ్ళి కూడా అయింది.

పరీక్షలూ, రెండూ పెళ్ళిళ్లు - వీటితో యెంత బిజీగా వున్నా శాంతి ప్రతి రోజూ మహా ప్రస్థానంలోని కవిత ఒకటైనా చదువుతూనే వుంది. కిషోర్‌ని గుర్తు తెచ్చుకుంటూనే వుంది.

ఆ తర్వాత యెప్పుడు పుస్తకాల షాపుకి వెళ్ళినా కిషోర్ కోసం ఆమె కళ్ళు వెతుకుతూనే వుండేవి. వెళ్ళినప్పుడల్లా కవితా సంకలనం ఒకటన్నా కొని తెచ్చుకునేది.

మళ్ళీ కాలేజీలు తెరిచారు.

సుభద్ర హైదరాబాదు వెళ్ళిపోవటంతో లీల ఒక్కతే అయింది. సహజంగానే శాంతీ లీలల మధ్య స్నేహం పెరిగింది. యూనివర్శిటీలో చేరే ముందు పుట్టింటికి వచ్చిన సుభద్రకు శాంతి ప్రస్తావన లేకుండా లీల మాట్లాడలేక పోవటం చూసి అసూయగా అనిపించింది.

సుభద్ర వాసు గురించి తప్ప మాట్లాడ లేకపోవటం చూసి లీల సంతోషంగా నవ్వుతూ అక్కను ఆటలు పట్టించింది. సుభద్ర వెళ్ళే వరకూ ప్రతిరోజూ సాయంత్రం శాంతి వాళ్ళింటికి వచ్చేది.

ముగ్గురూ కబుర్లతో, సినిమాలతో కాలక్షేపం చేసేవాళ్ళు. రాత్రి పదిగంటలకు అక్క చెల్లెళ్ళిద్దరూ శాంతిని వాళ్ళింటి దగ్గర దింపి వచ్చేవాళ్ళు.

సుభద్ర వెళ్ళాక యిద్దరికీ తోచనట్లయి పోయింది. మళ్ళీ సంక్రాంతి దాకా రానని చెప్పి వెళ్ళింది సుభద్ర. దసరాకు లీల హైదరాబాదు వెళ్ళేట్టు ఒప్పందం జరిగింది. మొత్తానికి దసరా సెలవలన్నీ ఒంటరిగా గడపాల్సి వచ్చేసరికి శాంతికి చెప్పలేనంత బోర్‌గా అనిపించింది.

సరిగ్గా అప్పుడే కిషోర్ కలిసే సరికి శాంతి మనసు వుత్సాహంతో నిండిపోయింది.

పైగా కిషోర్ పెద్ద కార్యక్రమంతో వచ్చాడు. విప్లవరచయితల సంఘం మహా సభలు ఆ సంవత్సరం గుంటూర్లో జరగబోతున్నాయి.

మరో పదిహేను రోజుల్లో, దసరా పండగ రోజుల్లో సభలు, చందాలు వసూలు చేయాలనీ, కరపత్రాలు పంచాలనీ రకరకాల పనులు చెప్పాడు.

శ్రీశ్రీ, రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు వంటి పెద్ద కవులూ రచయితలూ గుంటూరు వస్తున్నారని చెప్పాడు.

మొత్తానికి శాంతి ఆ సందడిలో భాగమైంది. చందాలు వసూలు చేసింది.

సభల దగ్గర వుత్సాహంతో తనూ భాగమవ్వాలని చూసింది గానీ తనకు తోడు అమ్మాయిలెవరూ లేరు. ఆడవాళ్ళు యిరవైమందికంటే లేరు.

సభల చివరిరోజు బహిరంగసభలో కిషోర్ ఆందోళన చూసినపుడు మాత్రం ఆమెకు పెద్ద రచయితలందరి మీదా కోపం వచ్చింది.

వాళ్ళు యెంతకూ బహిరంగ సభకు రారు. ఎవరో స్నేహితులింట్లో వున్నారట.

చివరకు వచ్చారు. ప్రసంగాలతో కవితా గానాలతో మహాసభ చాలా వుత్తేజకరంగా సాగింది.

శాంతి జీవితంలో ఆ మూడు రోజులూ మరపురాని రోజులయ్యాయి.

లీల తోడుగా వుంటే యింక బాగుండేది గానీ - తాను తనకు యిష్టమైన రచయిత లందర్నీ చూసి మాట్లాడగలగటం మాత్రం యెంత మంచి అనుభవం. ఆ అనుభవం తనకు యిచ్చినందుకు కిషోర్ మీద యెంతో స్నేహభావం కలిగింది.

ఆ తర్వాత శాంతి తరచు కిషోర్‌ని కలుస్తుండేది. కిషోర్ మెల్లిగా ఆమెకు మార్క్సిజం బోధించటం మొదలు పెట్టాడు.

కిషోర్ యిచ్చిన ప్రతి పుస్తకం చదివేది. దాన్ని గురించి కిషోర్‌తో చర్చించేది.

లీల కథలూ, కవితలూ అయితే చదివేది గాని సిద్ధాంత పుస్తకాలకు ఒక నమస్కారం పెట్టి వూరుకునేది. మూడవ సంవత్సరం పరీక్షలైపోవటం. శాంతీ, లీలా యిద్దరూ ఎమ్మే తెలుగులో చేరటం- కాలం చాలా వేగంగానే గడుస్తోంది. కిషోర్ ఎమ్మే అయిపోయింది. పూర్తిగా పార్టీ పనిలో మునిగిపోయాడు.

గుంటూర్లో మళ్ళీ పెద్ద యెత్తున పౌరహక్కుల సభలు జరుగుతుంటే శాంతిని కూడా ఆ సభల్లో భాగం చేశాడు. కానీ ఆ సభల్లో ఆ సంఘం రెండుగా చీలింది. శాంతీ, కిషోర్‌లు ఆ విషయం గురించి చాలాసేపు మాట్లాడుకుంటుంటే లీల వాళ్ళ మీద పోట్లాడి

యిక వాళ్ళిద్దరి మధ్యకూ తను రాననీ, తనకు ఈ రాజకీయాలతో పిచ్చెక్కించవద్దనీ చెప్పింది.

శాంతీ, కిషోర్ ఈ వాదోపవాదాలతో మరింత దగ్గరయ్యారు. శాంతి ఎమ్మే చివరి సంవత్సరంలోకి వచ్చిన పదిరోజులకేమో ఎమర్జెన్సీ పెట్టారు.

ఎమర్జెన్సీ ప్రకటించిన రోజు సాయంత్రం కిషోర్ కలిసి తను నెలరోజుల పాటు కన్పించననీ, కంగారు పడొద్దనీ చెప్పి వెళ్ళాడు.

ఆ సంగతి లీలతో చెప్పటానికి కూడా శాంతికి నోరు రాలేదు. మనసులో యేదో భయం. నెల రోజులు కాస్తా మూడు నెలలయ్యాయి కిషోర్ పత్తా లేడు.

లీల అడిగితే వూరెళ్ళాడనీ వస్తాడనీ చెప్పింది తప్పితే శాంతి తన మనసులోని భయాలు చెప్పలేదు.

అవి తననోటివెంట వస్తే చాలు నిజమవుతాయేమో నన్నంత భయంవేస్తోంది శాంతికి.

* * * * *

"ఇంక మనకు పిల్లలుంటే బాగుండదూ?" అంటున్న భర్తను చూసి భయ పడింది సుభద్ర.

వేరే మాటలేవో చెప్పి ఆ ప్రస్తావన తుంచెయ్యాలని చూసింది కానీ అతను ఆ రోజు గట్టిగా నిశ్చయించుకున్న వాడికి మల్లే పట్టుబట్టాడు.

"నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను. రెండు సంవత్సరాలు హాయిగా గడిపాం. ఇంక పిల్లలుంటే బాగుంటుందనిపిస్తోంది. మళ్ళీ యేజ్ యెక్కువయిన కొద్దీ లేనిపోని సమస్యలొస్తాయని అంటున్నారు. డెలివరీ కష్టం అవుతుందట కూడా"

పాలిపోయిన సుభద్ర ముఖం చూసి ఆశ్చర్యంతో ఆగాడు. "ఏంటి - ఏమైంది? ఎందుకలా అయిపోయావు?"

"మనకు పిల్లలు లేకపోతే యేం" బలహీనంగా అడిగింది.

"అదేంటి - మనకు పిల్లలెందుకుండరు?" ఆశ్చర్యంగా మొదలైన ప్రశ్న ముగిసేసరికి అనుమానం కిందికి మారింది.

"నాకు భయం"

"భయం యేంటి? ఎందుకు భయం?" "పిల్లల్ని కనటం అంటే భయం"

రెండు నిముషాలపాటు అతని నవ్వుతో ఆ గది దద్దరిల్లి పోయింది.

"పిచ్చిపిల్లా - ఆడవాళ్ళందరూ పిల్లల్ని కనటం లేదూ, భయం దేనికి? ఎవరితోనూ అనకు నవ్వుతారు."

ఇంకా వస్తున్న నవ్వును అణుచుకుంటూ అన్నాడు.

"నాకిష్టంలేదు" కన్నీళ్ళను కంట్రోలు చేసుకుంటూ గొణిగింది సుభద్ర.

"అదే యిష్టమవుతుంది పిచ్చి ఆలోచనలు నువ్వూ"

ఒక అధికారమైన ప్రేమతో చిన్న పిల్లను మందలించి దగ్గరకు తీసుకున్నట్లు సుభద్రను దగ్గరకు తీసుకున్నాడు.

మర్నాడు సాయంత్రం వంద పిల్స్ కొనుక్కొచ్చి జాగ్రత్తగా దాచింది సుభద్ర. ఆరు నెలల తర్వాత ఓ సాయంత్రం ఆఫీసునుంచి వస్తూనే "డాక్టర్ దగ్గరకు వెళ్దాం తొందరగా తయారవ"మని అంటున్న వాసు మాటలకు కలవరపడింది సుభద్ర. ఎందుకని అడిగితే "నువ్వు పరీక్ష చేయించు కుందువు గానీ" అన్నాడు వాసు.

"ఎందుకని?" ఎక్కడ్నించో భయం మెల్లిగా పాము పాకినట్టు పాకుతోంది,

"ఊరికినే - ఎవరిలోనూ ఏ లోపము లేదనిపించుకుంటే నయంగదా"

"లోపమేంటి?"

"ఏ లోపమూ లేకపోతే పిల్లలెందుకు పుట్టరు? సుభద్రా యింక వాదన ఆపేసి బయల్దేరు. నేను అప్పాయింట్‌మెంట్ తీసుకున్నాను. వెళ్ళాల్సిందే"

"మీరు కావాలంటే పరీక్షచేయించుకోండి. నాకు పరీక్ష అక్కర్లేదు. గిరీక్ష అక్కర్లేదు. పరీక్ష చేయించుకోవటం నాకిష్టం లేదు." సుభద్ర కూడా యిక గట్టిగా చెప్పాలనుకుంది.

"నాకు యిష్టం అని చెబుతున్నాను"

"ఇష్టమైతే మీరు చేయించుకోండి. నా శరీరం మీద మీ పెత్తనమేమిటి?" విసురుగా అంది.

"నీ శరీరం - ఔను - నీ శరీరం మీద పెత్తనం నాదే - నేను పెత్తనం చేస్తాను. నీ శరీరం కూడా నా యిష్టయే. చెప్తున్నాగదా - త్వరగా బయల్దేరు."

"నేను రాను. రాను."

సుభద్ర చెంప పగిలిపోయింది.

అతడంత పని చేస్తాడని యెంతమాత్రం అనుకోని సుభద్ర నివ్వెరపోయి అతన్నే చూస్తోంది.

"పిచ్చివాగుడు మాని బయల్దేరు. ఊ -" గద్దించాడు.

ఏడుస్తున్న సుభద్రను వోదార్చే ప్రయత్నం యేమాత్రం చేయకుండా

"ఊ-తొందరగా కానియ్ - అరగంటలో హస్పిటల్లో వుండాలి. నెలరోజులు క్రితం తీసుకున్న అప్పాయింట్‌మెంట్. ఇదిపోతే మళ్ళీ రెండు నెలల వరకూ దొరకదు."

"అరే - డాక్టర్‌తో పరీక్షచేయించుకోమంటే యింత రాద్ధాంతమా?"

సుభద్రని మొరటుగా బాత్‌రూంలోకి తోశాడు. సుభద్ర యేడుపుని బలవంతంగా మింగి ముఖం కడుక్కొని జుట్టు పైపైన దువ్వుకుని చీర మార్చుకుని తయారైంది. హాస్పిటల్‌కి వెళ్ళేంతవరకూ యెవరూ యేమీ మాట్లాడలేదు.

డాక్టర్ రూంలోకి తనతోపాటు వచ్చి చాలా ప్రేమగా తన గురించి మాట్లాడుతున్న భర్తను చూస్తే చాలా అశాంతిగా అనిపించింది.

తనమీద పెత్తనం చేయటం, ప్రేమ చూపించటం రెండు రకాలుగా వెంటవెంటే యేమీ వేదన పడకుండా చేయటం సుభద్రకు అసలు మింగుడు పడలేదు.

డాక్టర్ లేచి పరీక్షకోసం కర్టెన్ వెనక్కు వెళ్తుంటే తప్పనిసరై లేచింది.

జబ్బు లేకుండా, బాధలేకుండా నాకే మాత్రం అవసరం లేకుండా యెందుకు పరీక్ష చేయించుకోవాలి? ఎందుకు పరీక్ష చేయించుకోవాలి. యెందుకు? యెందుకు?

కళ్ళల్లోంచి నీళ్ళు దిండు మీదికి కారుతుంటే డాక్టరు చేస్తున్న పరీక్షలను పట్టించుకోకుండా బల్లమీద నిస్సత్తువ ఆవరించినట్లు పడివుంది.

డాక్టరు పరిక్ష పూర్తిచేసి సుభద్రని చూసి "ఎందుకేడుస్తున్నావు? నీలో యే లోపమూ లేదు. యూ ఆర్ పర్‌ఫెక్టలీ నార్మల్. మీ ఆయనలోనే యేదో లోపం వుండి వుండాలి. గెట్ అప్." అంది నవ్వుతూ.

సుభద్ర లేచి చీరె సరిచేసుకుంది.

ఈ లోపల డాక్టరు ముందు గదిలోకి వెళ్ళి భర్తతో ఆ విషయం చెప్పేసింది.

అతను నవ్వుతూ లేచి నిలబడ్డాడు.

ఆరోజు రాత్రి యేమీ జరగనట్టే సుభద్రను దగ్గరకు తీసుకున్నాడు.

సుభద్ర అతని చేతిని విదిలించికొట్టి అటు తిరిగి పడుకుంది.

"ఇంకా కోపం పోలేదా?" అంటూ యిటు తిప్పుకున్నాడు.

"సారి సుభా - నాకెందుకోపిచ్చికోపం వచ్చింది. అలా చెయ్యకుండా వుండాల్సింది. ఎప్పుడైన అలా జరిగిందా? ఈ ఒక్కసారే క్షమించెయ్" తను కొట్టిన చెంపను ముద్దు పెట్టుకున్నాడు.

ఎన్నడూ అతనిమీద వ్యతిరేకతలేని సుభద్ర ఆ బుజ్జగింపులకు కరిగిపోయింది. అతని గుండెలమీద తలపెట్టి ఏడవసాగింది. అతను సుభద్రను బుజ్జగిస్తూ నెమ్మదిగా దుఃఖాన్ని మరిపించాడు. క్రమంగా కోపం, దుఃఖం మర్చిపోయి యిద్దరూ ప్రేమగా మాట్లాడుకుంటున్నారు.

సుభద్ర హఠాత్తుగా అతన్ని ఒదిలించుకుని పక్కగదిలోకి వెళ్ళింది. "అరే-యేంటిది? యెక్కడికి?" అని అడుగుతున్న భర్తకు "ఒక్కనిముషం యిప్పుడే వస్తున్నా" అంటూ చీరెల అడుగునవున్న పిల్ తీసుకొని మంచినీళ్ళ కోసం వంటింట్లోకి నడిచింది. వాటర్ ఫిల్టర్‌లో నీళ్ళు గ్లాసులో పడుతుంటే తన హడావిడి మూలాన వచ్చిన చిన్న అలుపును తీర్చుకుంటూ చిన్నగా నిట్టూర్చింది.

"ఇంకానయం. ఇప్పుడన్నా గుర్తొచ్చింది" అనుకుంటూ పై కవర్‌చింపి టాబ్లెట్ వేళ్ళతో పట్టుకుంది.

మరో క్షణంలో పిల్ మింగేదే.

"ఏంటది?" అంటూవాసు వొచ్చి దాన్ని లాక్కున్నాడు.

సుభద్ర వొణికిపోతూ నుంచుంది.

"రోజు వేసుకుంటున్నావా?"

సుభద్ర తల మరింత ఒంగిపోయింది.

"నాకెందుకు చెప్పలేదు? అందుకేనా డాక్టర్ దగ్గరకి రానన్నావు. ఎందుకిట్లా చేస్తున్నావు?"

"నాకు భయం. పిల్లల్ని కనను"

"ఛీ-నోర్ముయ్ -ఏంటి భయం? ఆడ దానివి కావూ?"

సుభద్రను బరాబరా లాక్కెళ్ళాడు.

"నాకు భయం. మాఅమ్మ చచ్చిపోయింది' యేడుస్తోంది సుభద్ర.

"మీ అమ్మ చచ్చిపోతే - అందరూ చస్తున్నారా? చదువుకున్నావు ఆ మాత్రం జ్ఞానం లేదు?"

"నాకిష్టం లేదు. ఏమాత్రం యిష్టంలేదు" యేడుస్తూనే మొండిగా అంది. అతనా మాటలు పట్టించుకోకుండా

"ఎక్కడున్నాయి పిల్స్" అనడిగాడు. చూపించింది.

అవన్నీ తీసికెళ్ళి సింకులో పారేశాడు. సుభద్ర అడ్డంపడబోతే అవతలకు తోసేశాడు. సుభద్ర అలానే నుంచుని అతను చేస్తున్న పనిని గుడ్లప్పగించి చూసింది.

"పద -" సుభద్రను నెట్టుకుంటూ మంచంమీద పడేశాడు.

అతను తన మీదకి ఒంగబోతుంటే ఆపింది సుభద్ర.

"ఒద్దు-నాకిష్టంలేదు."

"పిల్ వేసుకోలేదనా?"

"కాదు - ఇప్పుడు ఈ గొడవంతా జరిగాక యేమీ జరగనట్టు యేమిటిది? నామీద మీకు కోపంగా వుంది. ఈ కోపం తగ్గనివ్వండి. నన్ను చెప్పనివ్వండి. నా భయం గురించీ, అయిష్టం గురించీ చెప్పనివ్వండి. మనం ముందు మాట్లాడుకుందాం. తర్వాత యేం చెయ్యాలో ఆలోచిద్దాం?"

"ఇప్పుడు మాట్లేడేదేంటి? పెళ్ళెందుకు చేసుకున్నావు?"

"మీరంటే నాకు యిష్టం. మిమ్మల్ని ప్రేమించాలనిపించింది. మీతో కలిసి బతకాలనిపించింది. అందుకు చేసుకున్నాను. నాకు మీమీద ప్రేమలేదూ? ఇష్టం లేదూ? మిమ్మల్ని ప్రాణంగా చూసుకోవటంలేదూ?" "ప్రేమ. ఇష్టం. ప్రాణం. అన్నీ నిజమే, నువ్వంటే నాకూ యిష్టమే. కానీ మనం పెళ్ళిచేసుకున్నాం. పిల్లల్ని కనాలి."

"కనకపోతే యేం?"

"అదేం ప్రశ్న? పిల్లల్ని కనకపోతే పెళ్ళి చేసుకోవటం యెందుకు?"

"మనిద్దరికీ యే లోపమూ లేదు. మనకేం ఖర్మ అట్లావుండటానికి అయ్యో - పిల్లల్లేరా అని ప్రతివాళ్ళూ జాలిపడుతుంటే చేతకాని వాడిలా - చేతులు నలుపుకుంటూ కూచోవాలా? నాకు పిల్లలు కావాలి."

"నాకు అక్కర్లేదు."

"ఐతే వేరే పెళ్ళి చేసుకోమంటావా?" ఆ ప్రశ్నకు బిత్తరపోయింది సుభద్ర.

"నాకు పిల్లలు కావాలి. నువ్వు కనవు. యేం చెయ్యమంటావు? నిన్నొదలి వేరే యింకొకతె ను చేసుకోనా?"

గద్దించినట్లు మహా వ్యంగ్యంగా, నిర్లక్ష్యంగా అడుగుతున్న అతని ధోరణికి సుభద్ర హృదయం కుంచించుకుపోయింది."

"అదికూడా ఆలోచిద్దాం. ఇట్లా కోపంగా కాకుండా ఒకర్నొకరు అర్థం చేసుకోవటానికి మాట్లాడుకుందాం. ఆ తర్వాత యేం చెయ్యాలో నిర్ణయించుకుందాం" బతిమాలుతూ చెప్పింది.

"ఏమిటి నిర్ణయించుకునేది? ఆడ దానివి-నిన్ను-పిల్లల్ని కంటావా లేదా అని అడుక్కో వాలా? పిల్లల్ని కనమని బతిమాలాలా? నువ్వు వొప్పుకోకపోతే యింకొక దాని దగ్గరకు పోవాలా? నేను మగాడిని - నాకేం ఖర్మ -"

కోపంగా సుభద్ర మీదికి దూకాడు.

సుభద్ర వ్యతిరేకతనేమాత్రం పట్టించుకోలేదు.

సుభద్ర చీరెను పక్కకు నెట్టేశాడు. ఆమె మీదకు పులిలా దూకాడు.

సుభద్ర అసహ్యంతో, అవమానంతో బిగుసుకుపోయింది.

ఇన్నాళ్ళూ ఆమెకు ఆ సమయంలో భర్తకు సహకరించడమే తెలుసు. భర్తనుంచి తనను తాను రక్షించుకోవాల్సిన రోజొకటి వొస్తుందని ఆమె యెన్నడూ అనుకోలేదు. అందువల్ల ఆమెకా ఆలోచన రాలేదు. ఆ పరిస్థితిని యెలా యెదుర్కోవాలో తెలియని అయోమయావస్థలో బిక్కచచ్చిపోయినట్లు అతని చేతుల్లో వుండిపోయింది.

మర్నాడు ఆదివారం.

సుభద్ర ఎప్పటిలా లేవకపోతే అతనే లేచి కాఫీ చేసి యిచ్చాడు.

కాఫీ తాగి లేచి యాంత్రికంగా పనులన్నీ ముగించింది.

పగలు గడిచిపోతోంది.

జరిగిన దానికి యెలా ప్రతిస్పందించాలో కూడా తెలియని దీనావస్థలో వుంది సుభద్ర. బిక్కచూపులు చూస్తూ తిరుగుతున్న సుభద్రను చూస్తే వాసుకి తాత్కాలికంగా జాలి కలిగింది గానీ -

"అంతా తను చేసుకున్నది కాదూ? ఆడది కానట్టుగా పిల్లల్ని కనను అని ఒళ్ళు పొగరెక్కి మాట్లాడితే - యెంతకాలమని ఓర్పుగా, సహనంగా వుండాలి? దేనికైనా ఒక హద్దుండాలి. ఆమె పిచ్చితనానికైనా, నా మంచి తనానికైనా?" అని తను చేసిన పని సరైందేనని గట్టిగా నిర్ణయించుకున్నాడు. అందువల్ల అతనికీ సుభద్రకూ మధ్య అలాంటి ప్రేమ రాహిత్యపు హింసాపూరితమైన రాత్రులు చాలా వచ్చి పోయాయి.

* * * * *

జనవరి నెల. సాయంత్రం ఐదుగంటలకే చీకటి పడుతోంది. ఐదింటికి పి.జి. సెంటర్ నుంచి చివరి బస్సు బయలు దేరుతుంది. లైబ్రరీ వర్కుముగించుకుని హడావిడిగా బస్సుకోసం పరిగెత్తుతున్న శాంతీ, లీలలు హఠాత్తుగా ఆగిపోయారు.

ఎదురుగా కిషోర్ -

శాంతికి సంతోషం, దుఃఖం అన్నీ ఒక్కసారి ఉప్పెనలా మీదికొచ్చాయి.

లీల కిషోర్‌ని చూసి సంతోషించింది గానీ ఆమెకెందుకో శాంతిని చూస్తే భయమనిపించింది.

ఎందుకంత ఉద్రేకపడుతోందా అని పించింది.

బస్సు బయల్దేరుతోందని హారన్ గట్టిగా మోగింది.

"లీలా-నువ్వెళ్ళు. నేను కిషోర్‌తో మాట్లాడి ఆలస్యంగా వస్తాను. సిటీ బస్‌లో వచ్చేస్తా'

లీలను బస్‌వైపు నెట్టింది శాంతి.

లీల పరిగెత్తుతున్నట్టే వెళ్ళి కదలబోతున్న బస్‌లో యెక్కింది.

దాదాపు యూనివర్సిటీ అంతా నిర్మానుష్యంగా వుంది. శాంతికి కళ్ళవెంట నీళ్ళు ఆగటంలేదు.

కిషోర్ ఎందుకేడుస్తున్నావన్న కొద్దీ ఆమె దుఃఖం పెరిగింది.

ఒక పావుగంట సేపు పట్టింది ఆ దుఃఖాన్ని కంట్రోలు చేసుకోటానికి.

"నువ్వు అరెస్టవుతావేమోనని భయం. ఇంకోవైపు అసలు యెక్కడున్నావో తెలియకుండా ఉండేకంటే అరెస్టయితే బాగుండుననీ అనిపించేది. కానీ నువ్వు అరెస్టయిన వార్తయినా నాకెలా తెలుస్తుంది? అంతా గందరగోళంగా వుంది. పోనీ-ఇప్పుడు నువ్వొచ్చావు. ఇక నిశ్చింత." శాంతి ఆపకుండా మాట్లాడుతోంది.

ఇద్దరూ మెల్లిగా ఆ యూనివర్సిటీ వెనకగా వున్న తోటదాటి కొండమీద దేవాలయం దగ్గరకు నడుస్తున్నారు.

వాళ్ళిద్దరూ గడిచిన రెండు సంవత్సరాలలో చాలాసార్లు ఆ దేవాలయ మంటపంలో కూచుని కబుర్లు చెప్పుకున్నారు. వాళ్ళిద్దరికీ యిష్టమైన చోటది.

శాంతి హడావిడిగా చెప్పే కబుర్లన్నీ తాపీగా విన్నాడు కిషోర్. "ఇరితకూ నువ్వు ఎక్కడున్నావు? ఎక్కడున్నా యింకా వచ్చేశావుగా-నాకు చెప్పకుండా యిలా అయోమయంలో వుంచి ఎక్కడికి వెళ్ళకు" అంది శాంతి.

కిషోర్ నవ్వి "బహుశ మనం కలుసు కోవటం యిదే చివరి సారి అవుతుందేమో" అన్నాడు. శాంతికి మళ్ళీ భయాలన్నీ ఒక్కసారి మనసులోకి దూకాయి. అవన్నీ శాంతి కళ్ళలోంచి కిషోర్ చదవగలిగాడు.

"నేను వారం రోజుల్లో యిక్కడ్నించి వెళ్ళి పోవాలి శాంతీ. బహుశ అదిలాబాద్ వెళ్తాను. పూర్తిగా యూ.జిలోకి వెళ్ళి పార్టీపని చూసుకోవాలని నిర్ణయించుకున్నాను. అది చాలా కష్టమైన నిర్ణయం మా కుటుంబానికి సంబంధించి. అమ్మా నాన్న, అక్కయ్య అందర్నీ ఒకసారి చూసి వెళ్ళాలని వచ్చాను. నిన్ను కూడా -

మళ్ళీ నేను మీ అందరినీ చూడగలుగుతానో లేదో, నిర్బంధం రోజురోజుకీ పెరుగుతోంది. ఎమర్జెన్సీ యెంతకాలం కొనసాగుతుందో తెలియదు. నేను యూజీకి వెళ్ళాలని పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయం మీ అందరికీ కష్టంగా వుండొచ్చు. బాధ కలిగించొచ్చు.

యేమైనా నేను యెన్నుకున్న జీవితం మాత్రం అదే -"

శాంతి నిశ్చేష్టురాలై కూచుంది.

అరు నెలలుగా కిషోర్ శాంతి మనసులో ఎన్నో ఆలోచనలు రేపాడు. కిషోర్‌ని ప్రేమిస్తున్నానని ఆమె గట్టిగా నమ్మింది. ఆ ప్రేమ పర్యవసానం యేమిటని ఆమె యెన్నడూ ఆలోచించలేదు.

కిషోర్‌కీ తనకూ పెళ్ళి జరగటం గురించి కూడా ఆలోచించలేదు.

కానీ కిషోర్ అంటే తనకు ప్రేమ అని మాత్రం గుర్తించింది. ఇప్పుడు కిషోర్ తన జీవిత విధానం గురించి చెబుతుంటే శాంతికి అర్థమైంది. తనకు కిషోర్‌తో కలిసి బతకాలని వుందని -

అప్రయత్నంగా అడిగేసింది.

"కిషోర్-మరి నేను-నేనేం చెయ్యను?" శాంతి అట్లా అడిగేసరికి కిషోర్ నిరుత్తరుడయ్యాడు.

శాంతి అంటే అతనికున్న ప్రేమ కొనసాగించటానికి ఎలాంటి అవకాశం లేదని కచ్చితంగా తెలిసిన అతను మాట్లాడలేక పోయాడు.

"నెలరోజుల తర్వాత నాకు కనపడవా?" శాంతి ప్రశ్నకు చిన్నగా నవ్వటం తప్ప యేం చెప్పలేకపోయాడు.

"ఎమర్జెన్సీ యెత్తేసీ మళ్ళీ మామూలు వాతావరణం మొదలయితే కనపడతానేమో'

"కిషోర్" శాంతి అతని చేతిని గట్టిగా పట్టుకుంది. కిషోర్ అనుకోకుండా శాంతిని దగ్గరకు తీసుకున్నాడు.

"ఎమర్జెన్సీలో అంతా అయోమయంగా వుంది. లేకపోతే నువ్వూ యేదో ఒక లెవెల్‌లో ఈ పనిలోకి వచ్చే వీలుండేది. ఇప్పుడు స్టూడెంట్స్ యూనియన్ కూడా రహస్యంగా పనిచేస్తుంది. నిన్ను హఠాత్తుగా తీసికెళ్తే నీకు కష్టమవుతుంది. అక్కడ యిమడలేవు."

శాంతిని ఒదిలి వెళ్ళక తప్పదని ఆమెకు అర్థంఅయ్యేలా ఆమె నొచ్చుకోకుండా చెప్పటం కోసం కిషోర్ ప్రయత్నిస్తున్నాడు.

"కిషోర్-నిన్ను పోలీసులు పట్టుకుంటే" భయంతో శాంతి శరీరం జలదరించింది.

"పట్టుకుంటే యేమవుతుంది? జైల్లో వేస్తారు లేదా కాల్చి చంపేస్తారు. నా ఫ్రెండ్ రామకృష్ణను చంపలేదూ? అలాగే"

శాంతి ఒక్కసారి ఒణికిపోయింది.

కిషోర్‌ని కాల్చేస్తారు. ఇక కనిపించడు. చచ్చిపోతాడు.

ఆ ఆలోచనలు భరించలేక కిషోర్‌కి మరింత దగ్గరకు జరిగింది.

కిషోర్ ఆమె భయాన్ని గుర్తించి మరేం ఫరవాలేదన్నట్టు ఆమెను దగ్గరగా తీసుకొని

ఒకసారి ఆమె భుజాలు నొక్కి వదిలేశాడు. కానీ శాంతి మరింత దగ్గరగా అతుక్కుపోయింది.

"ఇక వెళ్దాం శాంతీ చీకటి పడింది."

"ఒద్దు. నాకు వెళ్ళాలని లేదు" అతని మెడ దగ్గర ముఖం దాచుకుంటూ అంది.

"శాంతీ-ఏంటది. లే-వెళ్దాం" అలా అంటున్నాడేగాని కిషోర్‌కి కూడా లేవాలని లేదు.

కానీ తమిద్దరి సామీప్యతా యెక్కడికి దారి తీస్తుందోననే భయం అతన్ని కూర్చోనివ్వలేదు.

వెన్నెల నెమ్మదిగా శాంతి ప్రేమలా, కిషోర్ భయంలా ఆలయ మంటపంలోకి పాకుతోంది.

"నువ్వంటే నాకు ప్రేమ కిషోర్"

ఆ తర్వాత యి యిద్దరిలో యెవరూ మాట్లాడ నవసరం లేకపోయింది.

ఒకరి కౌగిలిలో ఒకరు తనివిదీరా బాధపడ్డారు.

నిముషాలు గంటలైపోయాయి.

మళ్ళీ మళ్ళీ ముద్దులూ, కౌగిలింతలు. రాత్రి పదిగంటలవుతోంది.

ఆకాశం నిండా తళతళ మెరుస్తూ చుక్కలు.

"నేను చచ్చిపోతానేమోననే జాలితో నాకీ అనుభవాన్నిచ్చావా శాంతీ- ఇపుడు నిజంగా చచ్చిపోయినా ఫరవాలేదనిపిస్తుంది." కిషోర్ మాటలను శాంతి భరించలేనట్లుగా అంది.

"లేదు. నీ కోసం కాదు. అట్లా అసలు అనుకోకు. నా కోసమే. నాకెంతో బాగుంది."

"కానీ యెట్లా? నేను వెళ్ళక తప్పదు."

"వెళ్ళు."

"మరి నువ్వు?"

"నాకేం-నేను బాగానే వుంటా. ఎమ్మే పూర్తిచేస్తా. పిహెచ్‌డీ చేస్తా. యూనివర్శిటీలో వుద్యోగం చేస్తా."

శాంతి యేడవసాగింది.

కిషోర్ నిస్సహాయంగా చూస్తున్నాడు.

శాంతి తనను తాను కంట్రోలు చేసుకుని "నేను నిన్ను ఆపటానికో, నేనో బంధం లాగా నిన్ను చుట్టుకోటానికో చూస్తున్నానని అనుకోకు. నీతో నాకీ అనుభవం కావాలి. పొందాను. దీన్నించి నేనింకేమీ ఆశించను. అంతే. వెళ్దామా -"

ఇద్దరూ లేచారు.

"కిషోర్ - నువ్వు వెళ్ళేవరకూ ప్రతిరోజూ మనం యిక్కడికి వద్దాం"

"శాంతి" కిషోర్ భయంగా అన్నాడు.

"నిజంగా. రావా? నా బాధ్యత నీమీద యేమాత్రం వెయ్యను"

"ఏం మాటలు శాంతీ-నీ బాధ్యత నా మీద వేస్తావని నేను భయపడతానా? నీ బాధ్యత ఒకవేళ నామీద ఉంటే అది నాకు ఎంత యిష్టంగా వుంటుందో నువ్వూహించలేవా? కానీ నీకు లేనిపోని సమస్యలు - అనవసరమైన బాధ - మన ప్రేమ మనల్ని కుంగదీయకూడదు శాంతీ -"

"ఎప్పటికీ కుంగదీయదు. నా ప్రేమను తల్చుకుని నేను గర్వపడతానేగాని కుంగిపోను."

"పదవెళ్దాం" ఇద్దరూ లేచి ముందుకు నడిచారు.

* * * * *

రాత్రి పదకొండు గంటలవేళ వచ్చిన స్నేహితురాల్ని చూసి బిత్తరపోయింది లీల. "ప్లీజ్-నన్నేం అడక్కు. రేపు చెబుతాను. నేనిప్పుడు నిద్రపోవాలి" అంటూ లీల మంచం ఎక్కేసింది శాంతి.

లీల అయోమయాన్నీ, ఆశ్చర్యాన్ని అణుచుకుంటూ శాంతి పక్కనే తనూ పడుకుంది.

అటు తిరిగి పడుకున్న స్నేహితురాలు మెలకువతోనే వుందని తెలిసినా పలకరించే సాహసం చేయలేక పోయింది.

మర్నాడు ఉదయం నిద్రలేచి తన మామూలు ధోరణిలో హుషారుగా మాట్లాడుతున్నప్పుడు కూడా రాత్రి విషయం ఏమిటని అడగలేక పోయింది.

"త్వరగా తయారవు మా యింటికి వెళ్ళాలి మా అమ్మా వాళ్ళు కంగారు పడుతుంటారు. మీ ఇంట్లో వుంటానని చెప్పాను గానీ -". అంటూ లీలను తొందరపెట్టింది శాంతి.

ఇద్దరూ కలిసి శాంతి వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళమ్మ కంగారు తగ్గించి కాలేజీకి వెళ్ళొస్తామని చెప్పారు.

"ఇవాళ కూడా శాంతి మా యింట్లో వుంటుందండీ-మా నాన్న గారు వూరెళ్ళారు" అని అడిగింది లీల.

"ఎందుకమ్మా యిద్దరు ఆడపిల్లలు ఒంటరిగా అక్కడ-ఇక్కడికి వొచ్చెయ్యరాదూ?" అంది జానకమ్మ.

"కాదులెండీ-ఇల్లు తాళం పెట్టొద్దని నాన్నగారు చెప్పారు. అదీగాక రేప్పొద్దున్నే

మా నాన్నగారు వస్తారు."

శాంతి చెప్పమన్నట్లే చెప్పింది లీల.

లీల శాంతి వాళ్ళింట్లో వుండటం, శాంతి లీల వాళ్ళింట్లో వుండటం రెండు కుటుంబాలకీ కొత్తగాదు. జానకమ్మ దాన్ని మరి పొడిగించలేదు. స్నేహితులిద్దరూ కాలేజికి వచ్చారు.

కాలేజిలో సందడేమీ లేదు. క్లాసులు కొన్ని జరుగుతున్నాయి. ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్ పరిక్షలు. అంతా నిర్మానుష్యంగా వుంది. వెయిటింగ్ రూం ఎవరన్నా వస్తారా అన్నట్లు వెయిట్ చేస్తోంది.

శాంతి కిటికీ దగ్గరకు వెళ్ళి నుంచుని బైటకు చూస్తోంది.

లీల ఆ పక్కకి ఒక కుర్చీ లాక్కుని కూర్చుంది.

ఐదు నిమిషాలలా గడిచాక "అడగవేం" అంది శాంతి.

"నువ్వేగా అడగొద్దన్నావ్ - చెప్పుమరి"

"లీలా-నేను చాలా సంతోషంగా వున్నానే. నిజంగా నేనొక అపూర్వమైన అనుభూతిని పొందాను. అనుకోకుండా హఠాత్తుగా జరిగింది"

"నాకు తెలిసింది" నవ్వుతూ శాంతి చేయి పట్టుకుంది లీల

"ఏంటిది?" శాంతి ఆశ్చరంగా అడిగింది.

"నువ్వు కిషోర్‌ని ప్రేమిస్తున్నావు. నిన్న కిషోర్ నీతో అదే విషయం చెప్పాడు. దాంతో నువ్వు బ్రహ్మానందం పొందావు. అంతేనా?" లీల నవ్వుతూ నవ్వుతూ చెప్పేసింది.

"కొంతవరకూ. కొంతవరకేమిట్లే అంతా కరక్టే. కానీ నువ్వూహించనిది కూడా జరిగింది. అది నువ్వూహించలేవుగాక లేవు"

"ఇంకేమిటి? వెంటనే పెళ్ళికి యేర్పాట్లు చేస్తానని వెళ్ళాడా నీ హీరో"

"పెళ్ళికి యేర్పాట్లు చెయ్యటం కాదు. పెళ్ళి జరిగిపోయింది."

కిలాకిలా నవ్వింది శాంతి.

"అంటే" అనుమానంగా చూసింది లీల.

"అంటే-అంటే-నీ అనుమానం కరక్టే. రాత్రి వెన్నెట్లో కొండమీద మంటపంలో - లీలా" ఒకరకమైన ఆనందంతో ఆవేశంతో చెప్తోంది శాంతి.

"శాంతి! నీకు పిచ్చెక్కిందా?" లీలకు మతిపోయింది.

"ఔను. సంతోషంతో పిచ్చెక్కుతోంది." "నీ సంతోషం పాడుగాను - ఎందుకింత తొందరపడ్డావు? పెద్దవాళ్ళతో చెప్పి పెళ్ళి చేసుకోవాలి గానీ-యిలా?"

లీలకు చాలా కంగారుగా దడగా వుంది శాంతిని చూస్తుంటే.

"పెళ్ళి కుదరదులే లీలా" అతి మామూలుగా శాంతి చెప్పిన మాట ఒక పట్టాన లీలకు అర్థంకాలేదు. లీలకు అర్థం చేయించడానికి శాంతికి చాలా కష్టమే అయింది.

ఒక వారం రోజుల్లో కిషోర్ కనపడకుండా అజ్ఞాతానికి యెక్కడికో వెళ్ళిపోతాడనీ, అతనికేం జరుగుతుందో, తిరిగి వస్తాడో రాడో అంతా అనుమానమేననీ చెప్తుంటే శాంతికి ఆనందమంతా యెటుపోయిందో దుఃఖం ముంచుకొచ్చింది.

లీల నోరు తెరిచింది అంతా విని.

"వారం రోజుల్లోపల నీకు కనిపించకుండా పోయేవాడితో రాత్రి" - యేమనాలో తెలియక ఆగింది.

"ఔను. అందుకే - నాకు కిషోరంటే యెంత ప్రేమో నీకు తెలియదూ? నెలరోజులలో అతనిక కనపడడు. ఒక్కసారి కూడా అతన్ని ముద్దు పెట్టుకోకుండానే నా జీవితాన్ని ముగించనా? నాకతనిమీద ప్రేమ పొంగుతున్నా సరే - పెళ్ళి కుదరదు కాబట్టి నాకేమీ ప్రేమలేనట్టు యెడంగా కూర్చోనా - యెంత అసహ్యం అది - యెంత అవమానం అది మా ప్రేమకు"

శాంతి స్థితిని లీల తనకు సాధ్యమైనట్లు అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.

"కానీ-యిప్పుడెల్లా-యేదన్నా జరిగితే?"

"ఏం జరుగుతుంది? ప్రెగ్నెంట్ ఔతానా? అవనీ - నాకు పిల్లల్ని కనటం యిష్టమే.'

"శాంతి - నీకు ఒళ్ళు తెలియటం లేదు. యేదన్నా జరిగితే నలుగురూ యేమంటారు? మీ అమ్మానాన్న యేమవుతారు? నీకు పెళ్ళెలా అవుతుంది? అమ్మో? ఎంత పని చేశావు?"

లీల గుండె చెరువైంది. శాంతి ఆ ప్రశ్నలన్నీ తీసిపారేసింది 'అంతగా అయితే ఎబార్షన్ చేయించుకుంటానంది.

"సరే నువ్వుదేన్నీ, ఎవర్నీ లెక్కచెయ్యవు. కానీ కిషోర్ యెప్పటికీ కనిపించడను కుందాం. నీకు పెళ్ళి చేసుకోవాలనిపిస్తుంది. అప్పుడెలా?"

"ఎలా ఏముంది. ఎవర్ని చేసుకోవాలనుకుంటానో వాళ్ళని చేసుకుంటాను"

"ఈ విషయం చెప్పవా?"

"చెబితే చెబుతాను. ఒద్దనిపిస్తే చెప్పను. నా యిష్టం. అసలు నేను పతివ్రతలా వుండాలని ఆశించే వాళ్ళను నేను పెళ్ళాడను."

లీల శాంతి వంక అదే పనిగా చూసింది. "నాకు నిన్ను చూస్తే భయంగా వుందే" అంది.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? పెళ్ళి కుదరదని కచ్చితంగా తెలిసీ కిషోర్తో సంబంధం పెట్టుకున్నావు. అతన్నెంతో ప్రేమిస్తున్నానంటూనే తర్వాత పెళ్ళాడాలనిపిస్తే ఎవర్నయినా పెళ్ళాడతానంటున్నావు. అతనితో చెబితే చెబుతాను. లేకపోతే లేదు అంటావు. నీ ధోరణి చాలా అసహజంగా వుంది. ఇదంతా కుదిరే పనికాదు. నువ్వు చాలా చిక్కుల్లో పడతావు." లీల శాంతిని నీళ్ళలో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించలేమని తెలిసి, ఒడ్డునున్న వ్యక్తి చూసినట్లు చూసింది. శాంతిని ఆ చూపులు చాలా డిస్టర్బ్ చేసింది. ఆ చూపునట్లా భరిస్తూ వుండటం ఆ అమ్మాయికి సాధ్యం కాలేదు. రేపట్నించే తానా చూపుని అలాంటి చూపులనూ నిత్యం యెదుర్కోవాలనే ఆలోచన శాంతిలో అలజడినీ ఆలోచననూ రేపింది.

లీల చూపుకీ, తన అలజడికీ సమాధానం చెప్పాలనిపించింది. ఆ సమాధానం యిది వరకే సిద్ధంగా వున్నది కాదు -

తన ఆలోచనలను తన ప్రేమ మీదా, తన మీదా పెడితే క్రమంగా యివాల్వ్ అవుతున్న సమాధానం కావచ్చు.

యిలాంటి చూపులకూ అవి కలిగించే కలవరానికీ భయపడితే ఈ సమాధానం స్ఫురించకపోవచ్చు.

కానీ శాంతి భయపడదలుచుకోలేదు.

"చిక్కుల్లో పడతాను. ఐతే యేమయింది? నేను సిద్ధంగా వున్నాను. చిక్కులు లేకుండా సాఫీ అయిన మార్గం అంటూ ఒకటి వుందా? కానీ నా ధోరణి అసహజమంటే నేను ఒప్పుకోను. నేను చాలా సహజంగా ప్రవర్తించాను. లోకం అసహజంగా ప్రవర్తించటానికి అలవాటు పడటంతో నా ధోరణి అసహజంగా అన్పిస్తోంది. నేనేం చెయ్యాలో చెప్పు - కిషోర్ వెళ్ళి పోతాడు. మళ్ళీ కనిపించడు. ఐనా సరే లోకం యేదో అనుకుంటుంది. గాబట్టి, మా పక్కింటివాళ్ళు చెవులు కొరుక్కుంటారు. గాబట్టి నేను నా ప్రేమనంతా అణిచేసుకోవాలా-

కిషోర్తో ఆ అనుభూతిని పొందకుండా వుండాలా ?

కిషోర్కి ఆ అనుభం లేకుండా చెయ్యాలా? అది చాలా అసహజం, అన్యాయం కదూ - మేమిద్దరం అలా వుంటే ఏమైంది?

ఎవరికి నష్టం ?"

తన ఆలోచనల తీవ్రతను తనే భరించలేక నొసలు రుద్దుకొంది శాంతి.

"కానీ ఆడపిల్లలు అలా వుండరు" గంభీరంగా అంది లీల.

"ఉండరు. నిజమే. కానీ నాకు ఆడపిల్లల ప్రేమమీద చాలా అపనమ్మకం. వాళ్ళకు ప్రేమకంటే సెక్యూరిటీ కావాలి. వాళ్ళ బాధ్యతంతా యెవరిమీదో పడేస్తారు. తమ బాధ్యత

తాము చూసుకోగలం అనే నమ్మకం లేనివాళ్ళు అసలు ప్రేమించలేరంటాను."

"కానీ మగవాళ్ళు మోసం చేస్తారు శాంతీ!"

"మోసం చేస్తారు. పెళ్ళి చేసుకుంటామని చెప్పి కొన్నాళ్ళు గడిపి ఒదిలేస్తారు. గిరీశంబోటి వాళ్ళు చాలా మందే వుంటారు. నిజంగా వాళ్ళను అసహ్యించుకోవాలి. కానీ ఈ ఆడపిల్లలు వాడికోసం యేడుస్తుంటారు. ఆ యేడుపు నాకు అసహ్యం. పోరా వెధవా నువ్వు నన్నొదిలేదేమిటి నేనే నిన్నువదిలేస్తాను. అనగలగాలి - మోసగింపబడటం - అసలు నా విషయంలో ఆ సమస్యే లేదు."

"అలా అంటానికి ఎవరికీ అభ్యంతరం వుండదేమో - కానీ ఫలానా వాడితో మోసపోయిందని యిక ఆ అమ్మాయినెవరూ చేసుకోరు. జీవితాంతం ఒంటరిగా వుండాలి -నీలా తొందరపడకుండా వుంటే - మగవాడిని హద్దుల్లో వుంచితే హాయిగా పెళ్ళి చేసుకుని సుఖంగా బతకొచ్చు గదా - కన్ను పోయేంత కాటుకెందుకంటా?"

లీలకు చాలా కోపంగా వుంది. ఆ కోపం పెరుగుతోంది.

"ప్రేమించిన వాడెక్కడ మోసం చేస్తాడోనని అడుగడుగునా అనుమానించటం, అనుక్షణం భయపడుతూ వుండటం, ఎప్పుడు పెళ్ళి అనే జైల్లో యిరుక్కోవాలా అని తొందర పడటం. ఇక అందులో పడ్డాక ఆ మొగుడేం చేసినా నోర్మూసుకుపడుండటం - యిదేనా సెక్యూరిటీ. అసలు ఆడదాని శీలం చుట్టూవున్న గందరగోళం వల్ల ఆడదాని జీవితం యింత దుర్భరమైంది.

భర్త చచ్చిపోతే పెళ్ళి చేసుకోకూడదన్నారు. ఇపుడా పర్మిషన్ యిచ్చారు. ప్రేమించినవాడు మోసం చేసిన ఆడదానికీ, భర్త చచ్చిపోయిన ఆడదానికీ తేడా యేమిటి? వీళ్ళ పెళ్ళి యెందుకంత అసాధ్యం కావాలి? నిజంగా మంచి మనుషులు దొరక్కపోతే ఒంటరిగా వుండటం నయంకదూ -

అమ్మాయిలకు జరిగే అన్యాయాలన్నీ వాళ్ళను అసమానత్వంలో వుంచి, వాళ్ళ శీలం చుట్టూ నీతి, అవినీతుల సాలెగూడు అల్లటం వల్లే జరుగుతున్నాయి.

అసమానత్వం లేకపోతే అసలు మోసాలనే ప్రసక్తే వుండదు."

"ఇప్పుడైతే సమానత్వం లేదుగదా - నువ్వు చేసింది పొరపాటే"

"కావచ్చు. మీ అందరి దృష్టిలో పొరపాటే - సమానత్వం వచ్చేవరకు నాలాంటివాళ్ళు తొందరపడే వాళ్ళుగానూ, అసహజమైన వాళ్ళు గానూ, శీలం లేనివాళ్ళు గానూ కనపడతారు. దుర్మార్గంగా కూడా కనపడతారేమో. కానీ - నా బాధ్యతనాదే - నాయిష్టమైనట్లునేనుంటా. ఇది పొరపాటు, అలా చెయ్య కూడదు అని నన్నెందుకు లేనిపోని టెన్షన్ పెడతారు."

లీల మాట్లాడకుండా కూచుంది.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగితే కాలం తనదారిన తను నడిచింది.

శాంతి వాచీ చూసుకుని

"ఐదయింది. కిషోర్ నాకోసం చూస్తుంటాడు. వెళ్తాను."

లీలా, శాంతి యికమాటలు పెంచకుండా బైటకి నడిచారు.

లీల తల పగిలిపోతుందనిపించేలా వుంది. శాంతిని వెళ్ళొద్దనే సాహసమూలేదు. వెళ్తుంటే పట్టనట్టు వుండే నిర్లిప్తతా లేదు. ఏం చెయ్యాలో తెలియక సతమతమవుతోంది. "రాత్రికి లేట్‌గా వస్తే వస్తాను. లేకపోతే అసలు రాను" అంటూ శాంతి మరో మలుపు తిరిగింది.

* * * * *

శాంతి తల్లి జానకమ్మకు పదిరోజులనుండీ మనసు మనసులో లేదు. శాంతి గురించిన అనుమానం ఆమెను పట్టి పీడిస్తోంది. నెలనెలా బైటజేరినపుడు మొదటి రెండు రోజులూ కడుపు నొప్పంటూ గొడవజేసే శాంతి ఈసారి మాట్లాడలేదు.

అసలు బైటజేరిందా అన్న అనుమానం ఆమెను భయపెడుతోంది. అడుగుదామంటే ఆమెకు మనసొప్పటం లేదు. ధైర్యమూ చాలటం లేదు. పైగా శాంతి ప్రవర్తన కూడా ఆమెకు వింతగా వుంది. ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ వుండేపిల్ల అస్తమానం పుస్తకం ముందేసుకుని కూచుంటోంది. పోనీ ఆ పుస్తకమైనా చదువుతుందా అంటే అదీ అనుమానంగానే వుంది. ఏదో ఆలోచిస్తున్నట్టు గంభీరంగా వుంటుంది.

ఐతే ఆలోచించేటపుడు ఆ అమ్మాయి ముఖంలో దిగులు, భయం, ఆందోళన లాంటివేమీ కనిపించకపోవటం జానకమ్మకు చిన్న ఆశ కల్పిస్తోంది. "చిన్నతనం పోయి కాస్త బాధ్యతగా వుండాలనుకుంటున్నదేమో - తన కూతురు బంగారం కదూ - ఎంత మంచి మనసు - ఎంత సున్నితమైన మనసు. పాపపు ఆలోచన దాని మనసులోకే రాదు. ఎవరికెక్కడ అన్యాయం జరిగిందని తెలిసినా ఆవేశంతో ఆక్రోశపడే శాంతి తనకు తాను అన్యాయం చేసుకుంటుందా?

అనాలోచితంగా అవమానం కొని తెచ్చుకుంటుందా."

ఇలా ఆలోచించి మరో ఇరవైరోజులు జానకమ్మ స్థిమితంగా గడిపింది. ఓ సాయంత్రం నీరసంగా పడుకునివున్న శాంతిని చూసి జాలితో కరిగి పోయిందామె మనసు. ఏ సమస్యవచ్చి పడిందో - ఎందుకిట్లా ఐపోతోందో అనుకుని మరి ఆగలేక శాంతి పక్కలో కూచుంది.

"ఏమ్మా - ఎందుకట్లా పడుకున్నావు" ప్రేమగా అడిగింది.

"ఒంట్లో బాగాలేదమ్మా - కడుపులో" -

జానకమ్మకు ఆనందం ఒక్కసారి జలపాతంలా మీదకు దూకింది.

"కడుపులో నొప్పిగా వుందామ్మా? బైటున్నావా?" పెద్ద రిలీఫ్‌తో అడిగింది.

'పిల్లకు యిరవై రోజులు ఆలస్యంగా నెలసరి వొచ్చేసరికి నాకు పిచ్చెక్కింది. యేంటో చిత్రం' అనుకుంది తేలికపడిన మనసుతో.

"నొప్పి కాదమ్మా - పొట్టలో తిప్పుతున్నట్లు వుంది".

జానకమ్మ గుండె గతుక్కుమంది. భయంగా కూతురి వంక చూసింది.

"డాక్టరు దగ్గరికి వెళ్దామా? నాన్నకు చెప్పనా?" గొంతు పెగుల్చుకుని అడిగింది.

"ఒద్దమ్మా"

"ఒద్దంటే ఎలా? బాగా నీరసంగా వున్నావు. పరీక్ష చేయించుకుని బలానికి ఏ టానిక్కయినా తీసుకోవాలి గదా - ఓ పక్క పరీక్షలొచ్చిపడుతున్నాయి." ఆశనిరాశలతో పెనుగులాడుతూ అన్నది.

"పరీక్షచేయించుకోనక్కర్లా. జబ్బు కాదు. నేను - నేను - అమ్మ నేను కూడా అమ్మనవుతాను తొందరలో"

జానకమ్మ గుండె వేగంగా కొట్టుకుంది. రక్తం మెదడులోకి వుధృతంగా ఎక్కి తల నరాలు టకటకా కొట్టుకోసాగాయి. ముఖమంతా ఎర్రబడి పోయింది గానీ నోట్లోంచి మాట రావటం లేదు.

"అమ్మా - అమ్మా" అని తల్లిని కదిపింది శాంతి

జానకమ్మ భోరున యేడవటం మొదలెట్టింది.

శాంతికేం చెయ్యాలో తెలియలా - సమయానికి అన్నయ్య, తండ్రీ కూడా యింట్లో లేరు. తల్లిని బలవంతంగా మంచం మీద పడుకో బెట్టింది.

"అమ్మా - వూరుకో. నాకేం కాలేదు. నువ్వూరుకో" అంటూ ఆమె తల నిమరసాగింది.

"అమ్మో-శాంతీ-ఎట్లాగమ్మా. నేనేం చెయ్యనమ్మా" అంటూ యేడుస్తోంది జానకమ్మ.

తల్లిని కావలించుకుని సముదాయిస్తే ఒక అరగంటకు ఆ వుధృతం తగ్గిసొమ్మ సిల్లినట్టు పడుకొని పోయింది.

ఇంతలో తండ్రి వొచ్చిన అలికిడి అయింది. గబగబా గదిలోంచి బైటకి వచ్చి గది తలుపులు దగ్గరగా వేసి వీధి తలుపు తియ్యటానికి పరిగెత్తింది.

తలుపు తీసింది.

చిరునవ్వుతో ప్రశాంతంగా లోపలికి వస్తున్న తండ్రిని చూస్తే జాలనిపించింది.

మరోక్షణంలో తండ్రి కూడా తల్లిలాగే అయిపోతాడు.

వీళ్ళిప్పట్లో కోలుకోలేరు. వీళ్ళిద్దరి కోసం మనసు మార్చుకుందామంటే తనవల్ల కావటం లేదు. తనకీ కోరిక యింత బలంగా యెందుకుంది? తండ్రి బట్టలు మార్చుకుని తల్లికోసం వెదుకుతున్నాడు.

వంటగదిలో చూసి బైటికొచ్చాడు.

శాంతి "నాన్నా - నీతో మాట్లాడాలి. ఇలారా" అని పిల్చేసరికి రంగనాథం ఆశ్చర్యపోయాడు.

"అమ్మేది?"

"ఉందిలే - నువ్వురా" అని కూర్చుంది శాంతి.

రంగనాథం ఆశ్చర్యపోతూనే కూర్చున్నాడు.

శాంతి కాసేపు యేం మాట్లాడలేదు.

"ఏంటమ్మా? ఏమైంది?" రంగనాథం కాస్త కంగారు పడ్డాడు.

"ఏం లేదు నాన్నా - నేను ఒకతన్ని ప్రేమించాను"

శాంతి ఆ మాట చెప్పటానికి తనకంత యిబ్బంది యెందుకో అర్థంగాక మరింత యిబ్బంది పడింది.

రంగనాథానికి ఏమనాలో, యెలా స్పందించాలో తెలియక పూర్తిగా అయోమయంలో పడి శాంతి వంక ఆ చూపే చూశాడు.

"అతని పేరు కిషోర్. ఎమ్మెస్సీ చదివాడు. మేం ప్రేమించుకున్నాం. ఐతే అతను కమ్యూనిష్టు. నక్సలైటని చెబితే నీకు తొందరగా అర్థమవుతుంది. అతను రహస్య జీవితానికి వెళ్ళక తప్పదు. అందువల్ల మేం పెళ్ళిచేసుకుని అందర్లా వుండటం కుదరదు."

గబుక్కున ఆగిపోయింది.

రంగనాథం ముఖం పాలిపోయింది.

"నువ్వు కూడా అతనితో కలిసివెళ్ళి పోతావా?"

"ఊహూ - వెళ్ళను. అతని పార్టీ అంటే నాకు అభిమానమే గానీ పూర్తిగా అతనితో వెళ్ళి పని చెయ్యలేనేమో - వాళ్ళూ నన్ను చేర్చుకుంటా రనుకోను. నేను మామూలుగా వుద్యోగం చేసుకుని బతుకుతాను."

రంగనాథానికి సమస్య యెక్కడుందో అంతు బట్టలేదు.

"అలాగేనమ్మా - నీ యిష్ట ప్రకారమే చెయ్యి. నిన్ను పెళ్ళి చేసుకోమని మేం ఒత్తిడి చెయ్యం. ఎప్పుడు ఎవర్ని చేసుకోదలిస్తే అతన్నే చేసుకో. ఇప్పుడీ అబ్బాయి అలా

వెళ్ళిపోయినా, కొన్నాళ్ళకు అతని మనసు మారొచ్చు. మళ్ళీ మామూలుగా అందరిలా బతుకుదాం అనుకోవచ్చు. కొంతకాలం చూద్దాం. అతనిలోనో, నీలోనో మార్పురావచ్చు."

రంగనాథం టెన్షన్ తగ్గించుకోటానికి గబగబా మాట్లాడాడు.

"నాన్నా - నేనిపుడు ప్రెగ్నెంట్ - కిషోర్ వల్ల" రంగనాథానికి యేం మాట్లాడాలో తెలియ లేదు.

"మీ అమ్మకు చెప్పావా?" అన్నాడు.

"చెప్పాను."

"ఏది? ఎక్కడుంది?" ఆయన మనసేదో కీడును శంకించి గబుక్కున లేచాడు.

"నాగదిలో" శాంతి మాట పూర్తికాలేదు. ఆయన ఆ గదిలోకి వెళ్ళాడు.

జానకమ్మ కప్పుకేసి పిచ్చిచూపు చూస్తూ పడుకుని వుంది.

రంగనాథాన్ని చూసి మళ్ళీ యేడుపు కట్టలు తెంచుకుందామెకు. ఆవిడను "ఊరుకో ఊరుకో" మని సముధాయిస్తూ తనూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు రంగనాథం. శాంతి వాళ్ళిద్దర్నీ అలా ఒదిలి తను డాబా మీదకు వెళ్ళి కూచుంది. తను ఎంత ఒంటరిదైందో ఆ క్షణాన శాంతికి బాగా అర్థమైంది."

"సాయంత్రం పెందలాడేరా డాక్టర్ దగ్గరకు వెళ్దాం. నాన్న కూడ వస్తాడు" కాలేజీకి వెళ్తున్న శాంతితో అంది జానకమ్మ. శాంతి విషయం మీద దంపతులిద్దరూ ఒక నిర్ణయానికి రావటానికి నాలుగు రోజులు పట్టింది.

ఆ నిర్ణయిం తీసుకున్న తర్వాతనే జానకమ్మ ముఖంలో కాస్త కళ వొచ్చింది.

శాంతికి తల్లి మనసులో యేముందో లీలగా అర్థమైనా తెలియనట్లే అడిగింది.

"ఎందుకు.?"

"ఎందుకేమిటమ్మా - నాలుగు రోజుల్నించీ, తిండీ, నిద్రా లేక మేం యేడుస్తుంటే -డాక్టర్ దగ్గరకు వెళ్ళి అది వొదిలించు కోస్తే -"

శాంతి ఉలిక్కిపడింది. అది - ఒదిలించుకోవాలట -

బాధతో మనసంతా ముడుచుకుపోయింది.

అది - అది - యేమిటది - ఒదిలించు కోవటం

"అమ్మా - నాకిష్టం లేదు. నేను బిడ్డను కంటాను."

జానకమ్మకి కోపం ఆగలేదు. రెండు రోజుల్నించీ రంగనాథం యెన్నో రకాలుగా చెప్పి ధైర్యం నూరిపోస్తే చిక్కబట్టుకున్న మనసు ఒక్కసారి చెదిరిపోయింది.

కోపం, దుఃఖం, భయం చుట్టుముట్టి ఆమెను పిచ్చెక్కినట్లయింది. ఆ కోపంతో ఆమె శాంతి చెంపలు పగలగొట్టింది.

"బిడ్డను కంటావా? మమ్మల్ని చంపి పారేసి అప్పుడు కను బిడ్డను.

కన్నవాళ్ళను యింత హింస పెడుతున్న కసాయిదానివి నువ్వు బిడ్డను కనేంత గొప్ప దానివా? కని యేం చేస్తావు?

దాన్ని కూడా గొంతు పిసికి చంపి పారెయ్యటం తప్ప యేం చేస్తావు?

ఏం చేస్తావ్?"

రంగనాథం వొచ్చి విడిపించేంతవరకూ శాంతి చెంపలూ భుజాలూ కందిపోతూనే వున్నాయి.

జానికమ్మని లోపలికి తీసుకెళ్ళి పడుకోబెట్టి శాంతి దగ్గరకు వచ్చాడు.

"శాంతీ - ఆలోచించుకో. చిన్న పిల్లవి కాదు. మంచీ చెడ్డ తెలియకుండా నీ యిష్టం వొచ్చినట్లు చేస్తే మేం చావాలా బతకాలా? ఇవాళో రేపో డాక్టర్ దగ్గరకు వెళ్ళాల్సిందే.

అమ్మనూ నన్నూ బతకనియ్యి. మాకు ఎట్లాగొట్లా ఈ కష్టాన్ని దాటిబతకాలని వుంది. రేపోమాపో వదిన ప్రసవిస్తుంది. మనవడిని చూసుకుని వాడితో ఆడుకోవాలనివుంది. అందరిలాగే ప్రశాంతంగా సహజంగా చచ్చిపోవాలనివుంది.

ఆత్మహత్య చేసుకు చచ్చిపోవాలని లేదు. మమ్మల్ని అటువైపుకి తరమొద్దు-"

రంగనాథం మాటల సారాంశంఅదీ!

ఆ రోజంతా జానకమ్మ తిండి మానేసి యేడుస్తూనేవుంది.

రంగనాథం ఆమెను ఓదారుస్తూ యింట్లోనే వున్నాడు. చిన్నతనం నుంచి తనను ఒక్కమాట అనకుండా, ఒక్క దెబ్బ వెయ్యకుండా పెంచుకొచ్చిన తల్లిదండ్రుల మీద తాను యెంత భారం మోపిందో శాంతికి అర్థమైంది. కానీ వాళ్ళు తనను చెప్పనిస్తే - తన మనసులో వున్నదంతా వాళ్ళకు తను చెప్పగలిగితే, తనకోసం ఈ తాత్కాలిక కష్టాన్ని భరించ గలుగుతారని శాంతి నమ్మకం. కానీ చెప్పుకునే వాతావరణమే లేదు.

రంగనాథం అసలు శాంతి ముఖం చూడటంలేదు. ఎప్పుడూ తన మీద ప్రేమ వర్షించే కళ్ళలో యిప్పుడు అసహ్యం, కోపం నిండటం చూసి శాంతికి ఆయన కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడటం అసాధ్యం అనిపిస్తోంది. అసలాయన ఆ అవకాశం యివ్వటంలేదు. శాంతి యేదోవిధంగా తల్లితో మాట్లాడదామని ప్రయత్నం చేస్తోంది. జానకమ్మ అసలు సహకరించటం లేదు.

శాంతి ఎబార్షన్‌కు ఒప్పుకోకపోతే తన పద్దతి అదేనని కూడా స్పష్టం చేసింది.

తనా ఇంటినుంచి వెళ్ళటం తప్ప మరోదాని లేదనిపిస్తోంది శాంతికి. తను ఇల్లు ఒదిలి వెళ్తే వీళ్ళిద్దరూ యేమవుతారు అన్న ఆలోచన రాకుండా కంట్రోలు చేసుకోవటం శాంతికి సాధ్యం కావటం లేదు.

తల్లి దగ్గర్నించి శాంతి తన గదిలోకి వచ్చి మంచం మీద కూచుంది.

గదినీ, గోడలనూ, గదిలోని ప్రతి మూలనూ పరిశీలనగా చూసింది. పదేళ్ళ వయస్సు నుండీ శాంతికి వేరే ఒక గది.

రేపల్లె నుంచి యిక్కడికి వచ్చినపుడు గది మారింది గానీ వస్తువులన్నీ అవే -

ఆ గది శాంతి సామ్రాజ్యం.

తనకు యిష్టమైన కవితలను తెల్ల కాగితాల మీద రాసి గోడమీద అతికించేది.

వారినికోసారి ఆ కవితలు మార్చేది. గత నెలరోజులుగా గోడమీద కవిత మార్చలేదు. నెలరోజుల క్రితం ఈ విషయం గురించి అనుమానం లేనపుడు, ఇంటా బయటా అంతా ఆనందమే వున్నపుడు ఆ కవితను అందంగా పెద్ద అక్షరాలతో రాసి మంచానికి ఎదురుగా అతికించింది.

"నా బ్రతుకు నేడు నందన చైత్రమౌనో
ప్రభాత గగన పూర్వప్రాంతణమౌనో
చెర తొలగు జీవమో! మరపు విడు తేజమో!
నడక నెరుగని తేనె! ఎరుక యెరుగని తావి
కయిసేసుకోలేక కలతపడు సోయగము పాటయై, పక్షియై ఆశయై హాయియై
దశదిశల మీరునో, దివ్యపథ మందునో"

ఆ కవిత కింది చిత్రించిన పూలగుత్తీ, పావురాయి యిప్పుడు శాంతిని వెక్కిరిస్తున్నట్టున్నాయి.

హృదయమంతా కళ్ళల్లోకీ, పెదవులపైకీ తెచ్చుకుని, అక్షరమక్షరాన్నీ తడుముతున్నట్లే చూస్తూ ఆర్ద్రంగా, ఆత్మీయంగా ఆ కవితను చదువుకుంది.

ప్రతిపదాన్ని ముద్దిడుకుంటున్నట్టే చదివింది.

మళ్ళీ గదంతా కలయిజూసింది.

మళ్ళీ యెప్పటికైనా అంత ఆనందంగా ఈ పద్యాన్ని చదవగలదా?

ఒక్కసారి వుప్పెనలా దుఃఖం ముంచుకొచ్చింది.

ఉధృతంగా వర్షామేఘంలా యేడ్చేసింది. వాన వెలిసింది తర్వాత ప్రశాంతమైన వాతావరణంలా మనసుస్థిమితపడింది. తనెందుకు ఆనందంగా వుండలేకపోతోంది? ఈస్థితి

తన ఆనందం కోసం తను కావాలని తెచ్చుకున్నదికాదూ? తను కావాలని కోరుకోకపోతే యిది జరగదే! ఇప్పుడైనా ఒద్దనుకుంటే ఆగిపోతుందే - నిజంగా యిది తనకు దుఃఖం కలిగించే విషయమా? కాదు-కానేకాదు. తనకు నిజమైన ఆనందం కలుగుతుంది గనకనే ఈ నిర్ణయం తీసుకుంది. ఆలోపు యెదురయ్యే తాత్కాలిక దుఃఖాలివి. పైపై బాధలివి. ఆనందం వుంది. తను కావాలనుకున్న అనుభూతినిస్తుంది.

అంతేనా? నిజమేనా? లేక సారంలో ఆనందానికీ, విషాదానికీ తేడాలేదా?

రెండూ ఒకేరకమైన గాఢమైన అనుభూతులా?

సందర్భాన్ని బట్టి పేర్లు మారతాయా? ఇదే అతనితో తనకు పెళ్ళయివుంటే ఈ యింట్లో పండగ చేసుకునేవారు గదూ.

కన్నీళ్ళతో కాక నవ్వుల జల్లుతో ఈ ఇల్లు మునిగిపోయేది కదూ. సంఘటన అదే - అనుభూతిలోని గాఢతా అదే - కానీ సందర్భం వేరు.

ఈ సందర్భం కేవలం మనుషులు కల్పించుకున్నది.

ఆడవాళ్ళ హక్కుల్ని అపహరించే సందర్భంలో స్వార్థపరులైన మగ మనుషులు కల్పించు కున్నది.

ఈ సందర్భం మొన్న యిట్లాలేదు. నిన్న యింకోలా వుంది. ఇవాళ యిట్లావుంది.

కానీ రేపు దీన్ని లాగే వుండనివ్వకూడదు. కారణం యేదైనా నా యిష్టం లేకుండా నేను నవ్వనూ గూడదు. యేడవనూ కూడదు.

నవ్వినా, యేడ్చినా, బిడ్డను కన్నా, కనకపోయినా అది నేను నిర్ణయించుకోవాలి. నా నిర్ణయం కష్టంగానే వుంది. సమాజాన్ని యెదుర్కోవటం దుర్భరంగానే వుంది.

ఐనాసరే - కష్టాన్ని నిబ్బరంగా ఎదుర్కోవాలి.

ఇష్టాన్ని నవ్వుతూ తీర్చుకోవాలి.

ఎట్టి పరిస్థితిలోనూ యేడవకూడదు. బలహీనపడకూడదు. 'అమ్మ - నేను చాలా యిష్టంగా సంతోషంగా తల్లినవుతున్నానమ్మ. తల్లిని కావాలని కోరుకుని, నా శరీరంలోని ప్రతి అణువు నా గర్భానికి సహకరిస్తుండగా నేను తల్లి నవుతున్నానమ్మా.

ఇది అనుకోకుండానో, అలవాటుగానో, పొరపాటుగానో, మామూలుగా రొటీనుగా జరిగినట్లో జరిగింది కాదమ్మా. నేను తల్లినవాలని ఆర్తితో తపించాను. ఆ వాంఛలే నా శరీరమంతా మండి, నా రక్తమంతా మరిగి నేనతని కౌగిలిలో వెన్నపూసలా కరిగిపోయాను.

ఇది నేను నీకు యెలా చెప్పనమ్మా? ఎలా చెప్పి అర్థం చేయించగలను?'

తల్లికి యెలాగైనా తన బాధ అర్థం చేయించాలనీ, తన మనసునంతా అక్షరాల్లోకి

యెక్కించాలనీ విశ్వప్రయత్నంచేసింది శాంతి.

చివరికి తను పుద్యోగం వెతుక్కుంటూ హైదరాబాదు వెళ్తున్నట్టు రాసి, ఉత్తరం పూర్తిచేసింది.

అమ్మను తలుచుకుని ఆరాటపడుతున్న మనసుని అదుపు చేసుకుంటూ చిన్నసంచీలో తన చీరెలు సర్దుకుంది. ఎన్నడూ వేసుకోని బంగారు గాజులూ, గొలుసూ వేసుకుంది. సర్టిఫికెట్లు తన దగ్గరున్న డబ్బూ తీసి హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుంది.

గదిలో ఆ మూలనుంచి ఈ మూలకు అర్థంలేని పరుగులు పెట్టింది.

చివరికి నెమ్మదిగా గదిలోంచీ, యింట్లోంచీ బైటపడింది.

* * *

మధ్యాహ్నం రెండు గంటలకు తలుపున్నీ బార్లా తెరచి, ఎక్కడా అలికిడి లేకుండా లీల యేం చేస్తోందో. యెక్కడుందో శాంతికి అర్థంకాక తను లోపలికి వచ్చి ఒక్కో తలుపు వేసింది.

"లీలా" అని పిలుస్తూ లీల గదిలోకి వెళ్ళబోతున్న శాంతిని లీల వచ్చి చుట్టేసింది. తనను గట్టిగా పట్టుకొని యేడుస్తున్న లీలను చూసి యెందుకో తెలియక పోయినా శాంతి తన మనసులోని మబ్బంతా కరిగిపోయెలా నిర్మలమయ్యేలా యేడ్చేసింది.

ఒక పదిహేను నిమిషాలకు గానీ స్నేహితులిద్దరూ కుదుట పడలేదు.

లీల శాంతిని తన గదిలోకి తీసుకువెళ్ళియిన్ని కాగితాలు చేతిలో పెట్టి.

"అక్క ఉత్తరం రాసింది" అంది మళ్ళీ కళ్ళనీళ్ళు వూరుతుండగా.

శాంతి ఒక రకమైన ఉద్వేగంతో ఆ కాగితాల వంక చూసింది.

ఈ అక్షరాలు తనకు యేం చెయ్యబోతాయి? యేముంది యిందులో - లీల యెందుకేడ్చింది?

శాంతికి ఒక్క క్షణం ఆ ఉత్తరం చదవొద్దని అనిపించింది. కాగితాలు చేతిలో పట్టుకొని లీల వంక రెండు నిమిషాలు అలాగే చూసింది.

"చదువు శాంతీ - ఆ ఉత్తరం నువ్వు చదవాలి. నీ నిర్ణయానికి బలం వస్తుంది" అంది లీల. శాంతి కళ్ళు ఆశ్చర్యంతో పెద్ద వయ్యాయి. నిన్నటి వరకూ లీల కూడా అమ్మలాగానే తన నిర్ణయాన్ని వ్యతిరేకించింది. ఒద్దంటే ఒద్దంది - తనకే మాత్రం సహకరించనంది. తను ముందే చెప్పానంది.

ఇప్పుడు తన నిర్ణయానికి బలమంటుందేమిటి - శాంతి ఉత్తరం వంక చూసింది. అంతే - ఆ పుత్తరంలోని అక్షరాలు శాంతి కోసం పరుగులు పెట్టాయి.

ప్రియమైన చెల్లీ -

పెళ్ళయిన కొత్తలో నీకు యిలాంటి వుత్తరం రాయాల్సి వస్తుందేమో అని భయపడేదాన్ని. ఇపుడు ఈ వుత్తరం రాసేంత శక్తి పొందిన ఈ సందర్భంలో ఆ అనుభవాన్ని నీతో పంచుకుని ఆనందించాలనే కోరికతో రాస్తున్నాను.

ఇపుడు నాకు భయం లేదు. దుఃఖం లేదు. ఆత్మ విశ్వాసం. ఆనందం. ధైర్యం. యివన్నీ మనమీద మనకు అధికారం వుందని తెలిసినపుడు అనివార్యంగా మనలో భాగమై పోతాయి. ఐతే ఈ అధికారం సంపాదించుకునే క్రమంలో నేను యెంత హింసను అనుభవించానో చెప్పలేను.

కాదు - చెబుతాను - ఆ హింస గురించి చెప్పక పోతే ఈ ఆనందం నీకు అర్థం కాకపోవచ్చు.

కానీ చెల్లి నేను నీకు అర్థం ఔతానా? నీకైనా అర్థం ఔతానా? ఇవాళ ఈ ఉత్తరంతో నీకు అర్థం కాకపోయినా ఓపికపట్టు. అక్కను అర్థం చేసుకునే రోజు యేదో ఒకటి వస్తుందనే నమ్మకంతో వుండు.

లీలా - పెళ్ళయిన ఆడది పిల్లల్ని కని తీరాల్సిందేనని యెవరు యెప్పుడు మొదటిగా శాసనం చేశారో నాకు తెలియదు. కానీ అది యెంత బలమైన తిరుగులేని శాసనంగా స్థిరపడిందో తెలిసినకొద్దీ మనకు భయం వేస్తుంది.

సామాన్యంగా ఈ శాసనానికి యెదురు తిరిగే ఆడవాళ్ళుండరనుకుంటాను. అది శాసనమని కాకుండా తమ జన్మ సార్థకమని భావించే ఆడవాళ్ళకి నేను పెద్ద పిశాచంలా కనపడుతున్నాను.

వాసు అమ్మ, అక్క, చెల్లీ అందరూ నన్ను అదే మాట అని వెళ్ళారు.

నాకు కూడా అది యింత బలమైన శాసనమనీ, దానికి యెదురు తిరుగుతున్నాననీ, దాని రథచక్రాల కిందపడి నలుగుతాననీ పెళ్ళి చేసుకునేప్పుడు తెలియదు -

ఎలాగోలా తప్పించుకోవచ్చులే అనుకున్నాను. కానీ ప్రతి ఒక్కరూ నన్ను వింత జంతువుని చూసినట్లే చూశారు.

నాలుగు నెలల క్రితం నా నరకం మొదలయింది. అపుడు వాసూకి స్పష్టంగా తెలిసొచ్చింది నా నిర్ణయిం యెంత బలమైందో, ఇక తన పశుబలంతో నన్ను జయించటానికి పూనుకున్నాడు. నన్ను కట్టేసి తల్లిని చేశాడు.

బహుశా పశువులలో యిది కుదరదనుకుంటా.

నీకు గుర్తుందా చెల్లీ మనం చిన్నప్పుడు అమ్మమ్మా వాళ్ళ వూరు వెళ్ళాం. అప్పుడొక ఆవుని కట్టేసి దానిపైకి ఆంబోతుని ఎక్కిస్తున్నారు. మనిద్దరం ఆ దృశ్యాన్ని చూసి

భయపడిపోయాం. గుర్తు వచ్చిందా? నువ్వు మరీ చిన్నపిల్లవి.

అపుడు అత్తయ్య చెప్పింది ఆవు యెదయిందనీ, అప్పుడట్లా చెయ్యాలనీ -

ఆ రోజుల్లో ఆవుకి తల్లి అవాలనే కోర్కెపుడుతుందట. అందుకోసం మనషులు ఈ యేర్పాటు చేశారట.

కానీ ఆడవాళ్ళకు తల్లి అవాలనే కోర్కె కలగకపోయినా సరే అది జరగాల్సిందే.

ఎద కాని ఆవు - తల్లి కావాలనే కోర్కె కలగని రుతువులో ఆవు అట్లా దొరికిపోదు మనుషులకు గానీ ఆంబోతులకు గానీ - ఆంబోతులు కూడా ఆ కోరికలేని ఆవులను ముట్టుకోవు. కానీ ఈ మనుషులు ఈ మగ మనుషులు తమ పెంపుడు జంతువుల కోసం యేర్పాటు చేసినట్లే తమ కోసం కూడా యేర్పాటుచేసుకున్నారు. పెళ్ళిని కనిపెట్టారు. పెళ్ళయిన ఆడది మగవాడు కోరుకున్నంత కాలంతల్లి కావటానికి సిద్ధంగా వుండాల్సిందే.

ఆడదాన్ని కట్టేసి అయినా తల్లిని చేయొచ్చని పశుపాలన రోజుల్నించీ మగవాడు తెలుసుకున్నాడా?

ఆ రోజు నుంచీ ఆడవాళ్ళంటే భయ పడటం మొదలు పెట్టి వుంటారు. సృష్టి రహస్యం వాళ్ళకు అర్థమైన రోజున, సృష్టి కొనసాగించటంలో స్త్రీ, పురుషుల పాత్ర తెలిసిన రోజున వాళ్ళెంత ఒణికిపోయి వుంటారో, యెంత భయపడిపోయి వుంటారో -

ఆ భయం నుంచి తప్పించుకోటానికి యెట్లా యెన్ని విధాలుగా ఆడదాన్ని హింసించి, అణిచి తన చెప్పు చేతుల్లో వుంచుకోవాలని ఆలోచించి వుంటారు. దానికి యెన్ని మార్గాలు కనిపెట్టారు. దానిలో పెళ్ళి, తల్లి కావటం గొప్ప అనేదాన్ని అందరి రక్తాల్లో ఎక్కించటం ఈ రెండూ చాలా బలమైనవని నాకనిపిస్తోంది. పెళ్ళికాని ఆడది పిల్లల్ని కనకూడదు.

పెళ్ళయిన ఆడది పిల్లల్ని కనితీరాలి.

ఈ శాసనం ఆడదాని భద్రత కోసం, వాళ్ళు పిల్లల్ని పోషించలేరని చేశారని అనుకునే దాన్ని.

అదికాదు - ఆడదాని సృష్టి శక్తిని తన కంట్రోలులో వుంచుకోటానికి మగవాడు కనిపెట్టిన తిరుగులేని ఆయుధం పెళ్ళి.

అది నాకు ఈ నాలుగు నెలలుగా అనుభవమవుతూ వచ్చింది. ఇదంతా అర్థం చేసుకోటానికీ, నీకిట్లా రాయటానికీ యెంత హింస పడ్డానో, యెంతగా నా మనసునీ, మెదడునీ మండించుకున్నానో నీకు తెలియదు.

నేను ఒక మనిషిని కాకుండా పోయిన ఆ క్షణాల నరకయాతనని నువ్వూహించలేవు.

ఈ వూపిరాడని నిముషాలలో చావుబ్రతుకుల పొలిమేరల్లో సంచరించి వచ్చాను.

బైటనుంచి వచ్చే అధికారాన్నీ ఆజ్ఞలను ఒప్పుకోవటమా నా ఆత్మలోపల్నించీ వచ్చే పిలుపులను పాటించటమా అనేది యెంత జీవన్మరణ సమస్య అవుతుందో తెలుసుకున్నాను.

నాలుగు నెలలపాటు నేను యెక్కడా, యెవరికీ చెందకుండా హింసా సరిహద్దులలో ప్రవాస జీవితాన్ని గడిపాను.

ఎవరికీ నేను తెలియను అర్థం కాను. నా ఆలోచనలూ, వూహలూ, నా భాషా అన్నీ వీళ్ళకు యేదో పరాయి లోకంలోంచి వచ్చినట్లుగా వున్నాయి.

నేను బహుశ ఈ పురుష సమాజానికి పరాయిదాన్ని.

దేనికీ లొంగని దాన్ని - దీన్నించి నన్ను వెలివేస్తారు.

నాలాంటి దాన్ని - సమాజం విధించిన కట్టుబొట్లకూ, శాసనాలకూ లొంగని వాళ్ళని వెలివెయ్యటం, బంధించటం, అణచటం, చంపటం వాళ్ళకు కొత్తకాదు. అందువల్ల అసహజంగా అనిపించకపోవచ్చు.

కానీ నా పరిస్థితి నాకు చాలా అసహజంగా వుంది. ఏమీ చేతకాని దానిలా యేడుస్తూ కూచోటం, జరిగిన దానికి యేడవటం తప్ప మరో దారిలేనట్లు చేతులు ముడుచుకు కూచోటం చాలా అసహజంగా వుంది.

నా ఈ శరీరం నాది కాదా? దీని మీద అధికారం నాది కాదా? దీని మీద హక్కు నాకు లేదా అని నాఆత్మ అరిచే అరుపులను విననట్లూ, అవి వినపడనట్లూ కూచోటం నా చేత కావటంలేదు. ఇది ఒక వ్యక్తిగా నాకు అసహజ పరిస్థితి. ఈ అసహజ పరిస్థితి నుంచీ నేను లేవాలి. నా రెండు కాళ్ళ మీదా నిలబడి నేను ఈ నేల మీద నా యిష్టానుసారం నడవాలి.

నేనెక్కడ పరాయిదాన్ని కానో, యెక్కడ నాకూ, నా ఆలోచనలకూ గౌరవం దొరుకుతుందో ఆ చోటుని వెదుక్కుంటూ వెళ్ళాలి.

ఆ చోటు యెక్కడా లేదని వీళ్ళు చెప్పే మాటలు నేను నమ్మను. ఒక వేళ యింత వరకూ ఆ చోటు యెక్కడా లేకపోతే నేను సృష్టిస్తాను.

ఆడది కేవలం పిల్లల్ని మాత్రమే సృష్టిస్తుందనుకునే వాళ్ళ కళ్ళు తెరిపించేలా, నేను క్రొత్త ఆలోచనలనూ కొత్త చోటునూ సృష్టిస్తాను.

లీలా - నేను వారం రోజుల క్రితం అబార్షన్ చేయించుకున్నాను. ప్రస్తుతం ఒక వర్కింగ్ వుమెన్ హాస్టల్‌లో వుంటున్నాను. ఇక్కడ ఒక స్త్రీల సంఘం సహాయంతో త్వరలో ఒక వుద్యోగం సంపాదిస్తున్నాను.

ఈ ఉత్తరం అందుకున్నాక నన్ను చూడాలనిపిస్తే నువ్వూ, నాన్నా రండి. నా అన్వేషణలో నా భుజం తట్టాలనిపిస్తేనే రండి. ఇంతవరకూ వాసూ, అతని తల్లిదండ్రులు,

బంధువులు, స్నేహితులు చెప్పినమాటలే మీరు చెప్పదల్చుకుంటే నా దగ్గరకు రాకండి. ముందే ఈ విషయాలు వింటే మీ కంట్లోని కన్నీరో, నాన్న దీనంగా చూసే చూపులో యేదో ఒకటి నన్ను బలహీన పరుస్తుందే మోనన్న భయంతో నేను యింతవరకూ మీకు యేమీ చెప్పలేదు.

నేను పడే హింస గురించి తెలిస్తే మీరు నాకు అండగా వుంటారేమోననే భయంతో వాసూ అతని తల్లిదండ్రులనూ అక్క చెల్లెళ్ళనూ పిలిపించి నాకు బుద్ధి చెప్పించాడు గాని మీ మాటే తలవలేదు.

ఇపుడు నిజంగా నేను హాయిగా వున్నాను. నన్ను చూడాలనిపించటం లేదూ?

ప్రేమతో అక్క సుభద్ర.

ఉత్తరం చదువుతున్నంత సేపూ శాంతి కళ్ళవెంట వుబికి వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూనే వుంది.

ఐతే ఈ కన్నీళ్ళల్లో బాధ, భయం, చేతగాని తనం లేవు. ఒక జీవితకాలపు ఒంటరితనం లో నును వెచ్చని స్పర్శ తగిలితే మన ప్రమేయం లేకుండా కురిసే కన్నీరిది.

ఆ కన్నీరు ఒక వంక కారిపోతుంటే మరో వంక తనను ఆవరించిన నిస్సత్తువ దూరమై మెల్లగా చైతన్యం రక్తంలోకి ఇంజక్ట్ అవుతున్న అనుభూతి.

"లీలా - నేను యిక్కడికి రావటం యెంత మంచిదయింది. నేను హైదరాబాదు వెళ్తున్నాను. సుభద్ర దగ్గరికే వెళ్తాను. మా యిద్దరి బాధ ఒకటే - తిరుగుబాటు ఒకటే. మేం ఒకరికొకరు తోడుగా వుంటే యిద్దరికీ బలం వస్తుంది."

లీల మనసు యెంత తేటపడిందో ముఖంలో కనిపిస్తూనే వుంది.

"నేనూ వస్తాను శాంతీ - నా తోడు మీకు అవసరమున్నా లేకపోయినా మీ సాహసం, మీ సావాసం నాకు అవసరం".

కలిసిన యిద్దరు స్నేహితుల చేతులూ, సుభద్ర చేతికోసం ముందుకు సాగాయి.

*(ఏప్రిల్ 1997, ఆహ్వానం)*